RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS




We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 13 మే 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:290

# మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ పూర్తి చేయాలి



వార్తా 2 లో



**కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు**

**రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూడాలి**

**కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పర్యవేక్షించాలి**

**: కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

## చంచల్గూడలో తెలంగాణ జైలు మ్యూజియం మరియు "ఫీల్ ది జైల్ ఎక్స్పీరియన్స్/జైల్ అనుభవం"ను ప్రారంభించిన తెలంగాణ గవర్నర్

వార్తా 3 లో




## నీట్ రద్దుపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

## నీట్ పరీక్ష రద్దు కావడం అత్యంత దురదృష్టకరం.



ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 12 ((ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :తెలంగాణలో సుమారు 70,వేల మంది, దేశవ్యాప్తంగా సుమారు 22, లక్షల మందికిపైగా విద్యార్థులు,ఈసారి నీట్ రాసి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు,వారి భవిష్యత్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇబ్బందుల్లోకి నెట్టింది. నీట్ నిర్వాహణలో (ఎన్‌టీఏ) పూర్తిగా విఫలమైంది,గతంలో జరిగిన ఘటనల నుంచి నేర్చుకుని, పకడ్బందీగా పరీక్ష నిర్వహించకుండా నిర్లక్ష్యం వహించింది,ఎన్‌టీఏ నిర్లక్ష్యం 22,లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌కు ప్రమాదకరంగా పరిణమించింది,పరీక్ష రద్దు కావడంతో ఎంతో మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతున్నారు,కేంద్ర ప్రభుత్వం ఇకనైనా సరియైన రీతిలో స్పందించి, ఇంత పెద్ద తప్పిదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి,ఈ విషయంలోవిద్యార్థులు, వారి తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది

## మోడీ ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో మాట

## తెలంగాణ ప్రభుత్వం సలహాదారుడు వి.హనుమంతరావ్



దేశ ప్రధాని ప్రజలకు పెట్రోల్ డీజిల్ గ్యాస్ బంగారం కొనవద్దని హితబోధ చేయడం కాదని, గుజరాత్ రాష్ట్రానికి చెందిన బడా వ్యాపారస్తులు అంబానీ ఆదాని వేల కోట్ల రూపాయలు ఉన్నాయని దేశం కిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు ఆదుకోవాలని తెలంగాణ ప్రభుత్వం సలహాదారుడు వి.హనుమంతరావ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోడీని డిమాండ్ చేశారు. వి.హెచ్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భారతదేశ బడ్జెట్ ఎంత ఉందో గుజరాత్ రాష్ట్రానికి చెందిన వ్యాపారస్తుల వద్ద అంతకంటే ఎక్కువ వేలకోట్ల రూపాయలు ఉన్నాయని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యుద్ధం ఎందుకు ఆపలేదని , ట్రంపు నీ మిత్రుడే కదా ప్రశ్నించారు. నీవు మోడీ ప్రధానమంత్రి అవ్వడానికి గుజరాత్ రాష్ట్రానికి చెందిన బడా వ్యాపారులు ఆదుకున్నారని, ఇప్పుడు దేశ ప్రజలను వ్యాపారస్తులు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో మాట విచిత్రంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు.

# జూన్ 2న ఆదిలాబాద్ లో ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభం

**పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా క్యూర్ పరిధిలో 5 నుంచి 8 కి.మీ. పరిధి లోనే ఇందిరమ్మ ఇండ్లు**

**నియోజక వర్గం యూనిట్ గా స్థలాల గుర్తింపు**

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుపై స్పెషల్ డ్రైవ్**

**ఈనెల చివరిలోగా హైదరాబాద్ లో ఇండ్ల స్థలాలు కలిగిన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు**

**అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా సహించేది లేదు**

**ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సమీక్ష లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**




హైదరాబాద్, మే 12 : రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారి సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా మంగళవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమీషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రిగారు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ శ్రీ జి.ప్రసాద్ కుమార్ రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీ డి.శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్.పి.మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదని అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్ధిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజక వర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో

## హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్.

## - మధ్యంతర బెయిల్ కావాలని అభ్యర్థన.

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.ఈనేపథ్యంలో మధ్యంతర బెయిల్ కోరుతూ బగీరథ్ తరపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు.

## ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

వార్తా 3 లో

# ప్రజాబలం

13 మే 2026 బుధవారం

## బంగారం కొనొద్దని ప్రధాని మోదీ ఎందుకు...

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది.. మనం దేశభక్తిని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది.. అయితే అందుకోసం పెద్దపెద్ద త్యాగాలు చేయాల్సిన పని లేదు.. కానీ మన రోజువారీ పనుల్లో కొన్ని మార్పులు చేసుకుంటే సరిపోతుందని సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బిజెపి బహిరంగ సభలో ప్రధాని మోదీ అన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా మళ్లీ కోవిడ్ కాలం నాటి పని సంస్కృతిని ప్రజలందరూ అలవాటు చేసుకోవాలని సూచించారు.భారతదేశంలో బంగారం కేవలం ఒక లోహం మాత్రమే కాదు.. దీనిని సంప్రదాయానికి, సంపదకు, సామాజిక హోదాకు చిహ్నంగా భావిస్తారు. ముఖ్యంగా వివాహాలు, దీపావళి, అక్షయ తృతీయ వంటి పండుగల సమయాల్లో బంగారం కొనుగోళ్లు గరిష్ట స్థాయికి చేరుకుంటాయి. కొన్ని గణాంకాల ప్రకారం.. భారతీయులు ఏటా సగటున 700 నుండి 800 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలుపుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారాన్ని వినియోగించే దేశాల్లో భారత్ ఒకటిగా నిలవడానికి ఇక్కడి ప్రజలకు ఈ పసిడిపై ఉన్న మక్కువనే ప్రధాన కారణం. అయితే ఇటీవల మోదీ బంగారం ఎక్కువగా కొనుగోలు చేయొద్దని ప్రకటన చేశారు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందిదేశంలో బంగారానికి భారీ డిమాండ్ ఉంది. కానీ ఇందుకు విరుద్ధంగా మన దేశీయ ఉత్పత్తి అత్యంత స్వల్పంగా ఉంది. ఏటా కేవలం 1 నుండి 2 టన్నుల బంగారం మాత్రమే మన గనుల నుండి లభిస్తోంది. దీనివల్ల దాదాపు 90 శాతం కంటే ఎక్కువ డిమాండ్‌ను విదేశీ దిగుమతుల ద్వారానే తీర్చుకోవాల్సి వస్తోంది. ముడిచమురు తర్వాత భారత్ అత్యధికంగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేస్తున్నది బంగారం దిగుమతుల కోసమే. దీనివల్ల దేశ కరెంట్ అకౌంట్ లోటు పెరిగి, రూపాయి విలువపై, విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోంది.ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణలో పర్యటించినప్పుడు తెలిపారు. కనీసం ఏడాది పాటు కొత్త బంగారం కొనకుండా ఉండటం వల్ల దేశం నుంచి బయటకు వెళ్లే విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని, ఆ నిధులను దేశాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పసిడిపై పెట్టుబడి పెట్టడం వల్ల అది వ్యక్తిగతంగా లాభదాయకంగా అనిపించినప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ పరంగా అది 'డెడ్ ఇన్వెస్ట్‌మెంట్' గానే మిగిలిపోతుందనేది నిపుణుల వాదన.బంగారం కొనుగోళ్లను తగ్గించడానికి ప్రభుత్వం 'సావరిన్ గోల్డ్ బాండ్' పథకాన్ని ప్రవేశపెట్టింది. భౌతికంగా బంగారాన్ని కొని లాకర్లలో దాచుకోవడం కంటే, బాండ్ల రూపంలో పెట్టుబడి పెట్టడం వల్ల విదేశీ దిగుమతుల భారం తగ్గుతుంది. దీనివల్ల వినియోగదారులకు భద్రతతో పాటు అదనపు వడ్డీ కూడా లభిస్తుంది. ప్రజలు తమ పెట్టుబడి దృక్పథాన్ని మార్చుకుని, భౌతిక బంగారం నుంచి డిజిటల్ , బాండ్ల వైపు మళ్ళినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది అని ఆర్థిక నిపుణులు అంటున్నరు.స్టాక్ మార్కెట్‌లో బ్లడ్ బాత్ చూడగానే అర్థమైంది అందరికి. మోదీ ఇచ్చింది స్టేట్‌మెంట్ కాదు అదొక వార్నింగ్ సిగ్నల్ అని. పొలిటికల్‌గా, ఒక పొలిటీషియన్‌గా నరేంద్ర మోదీ ఎంత అగ్రెసివ్‌గానైనా మాట్లాడొచ్చు. కాని, దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన మ్యాటర్ అయితే మాత్రం.. ప్రతి అక్షరాన్ని, ప్రతి పొల్లును కొలతకొలిచినట్టు మరీ మాట్లాడతారు. అంతా సుభిక్షం, అంతా ప్రశాంతం అనాల్సిన మూమెంట్‌లో... 'జాగ్రత్తగా ఉండండి' అని అన్నారంటే, కచ్చితంగా 'దేశం క్లిష్ట పరిస్థితి'లో ఉందనే అర్థం. భయపెట్టాలని కాదు గానీ.. దేశ ప్రజలను ముందస్తుగా ప్రిపేర్ చేస్తున్నట్టు కనిపిస్తోంది ఆ మాటల్లో. సేవింగ్స్ మొత్తం ఖర్చైపోవచ్చు. ఏదైనా జరగొచ్చు. మోదీ మాటలను డీకోడ్ చేస్తే వచ్చే అర్థం ఇదే. భారతదేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారు వినియోగదారు. ఏటా సగటున 700 నుండి 900 టన్నుల బంగారాన్ని మనం దిగుమతి చేసుకుంటున్నాం. ఇక్కడే అసలు సమస్య మొదలవుతోంది. మనం దిగుమతి చేసుకునే ప్రతి గ్రాము బంగారానికి అమెరికన్ డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఏటా 35-45 బిలియన్ డాలర్లు బంగారం దిగుమతులకే ఖర్చవుతాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ట్రాయ్ ఔన్సుకు 3,000 డాలర్లు దాటడంతో ఈ బిల్లు తడిసి మోపెడవుతోంది.ఒకవైపు పసిడి ధరలు భగ్గుమంటుంటే, మరోవైపు మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాల వల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 126 డాలర్లకు చేరుకున్నాయి. దేశం నడవాలంటే చమురు తప్పనిసరి. మనం మన అవసరాల్లో 85శాతం దిగుమతి చేసుకుంటున్నాం. చమురుతో పోలిస్తే బంగారం కొనుగోలు అనేది ఒక ఆప్షన్ మాత్రమే..ముఖ్యంగా పెళ్లిళ్ల కోసం కొనే బంగారాన్ని వాయిదా వేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊరట లభిస్తుంది.దేశం యొక్క ఆర్థిక స్కోర్‌కార్డ్‌నే కరెంట్ ఖాతా అంటారు. మనం ఎగుమతుల ద్వారా సంపాదించే దానికంటే, దిగుమతుల కోసం ఖర్చు చేసేది ఎక్కువైతే లోటు ఏర్పడుతుంది. ఈ లోటు పెరిగితే రూపాయి విలువ పడిపోయి, ఆర్థిక వ్యవస్థ అస్థిరంగా మారుతుంది.భారతదేశంలో ఏటా సుమారు 10-12 మిలియన్ల వివాహాలు జరుగుతాయి. అక్టోబర్ నుండి ఫిబ్రవరి వరకు ఉండే పెళ్లిళ్ల సీజన్‌లోనే దేశంలో అత్యధికంగా బంగారం అమ్ముడవుతుంది. "ఇది నిషేధం కాదు, కేవలం ఒక నైతిక విజ్ఞప్తి మాత్రమే. దేశం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పౌరులు స్వచ్ఛందంగా తమ కొనుగోళ్లను వాయిదా వేసుకుంటే, అది దేశ విదేశీ మారక నిల్వలను కాపాడుతుంది" అని ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయపడుతున్నారు.క్లుప్తంగా చెప్పాలంటే, మళ్లీ లాక్‌డౌన్ పరిస్థితులు రాకుండా ఉండాలన్నా, రాబోయే ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నుండి సామాన్యులను, దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి, ప్రజల్లో క్రమశిక్షణ, పొదుపు అనే ముందస్తు జాగ్రత్తలను అలవాటు చేసేందుకుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది

## మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ పూర్తి చేయాలి

### : కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





మిషన్ మోడ్‌లో పనిచేసి రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవడంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతీ అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు.

వివిధ ప్రాంతాల్లో గోడౌన్స్ సమస్య ఉన్నట్లు తెలుస్తోందని, అలాంటి ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలాచూడాలని సూచించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్ట్ పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**అకాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ**

అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలని, వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు.

ప్రతీ IKP సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ప్రతీ రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచాంరు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

**పంట కొనుగోళ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని తెలిపారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

**రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు: మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంత మంది ధాన్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు ధాన్యం తీసుకురాకుండా సంబంధిత జిల్లా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

## జూన్ 2న ఆదిలాబాద్ లో ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభం

### మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి




**మొదటి పేజీ తరువాయి**

ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు మాట్లాడుతూ గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదని అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిథిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిథిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఆ ఇండ్లపై స్పెషల్ డ్రైవ్**

2 బిహెచ్ కె ఇండ్లకు లబ్ధిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి శ్రీ పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్ధిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్ధిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు.

హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశించారు.

అంగుళం అన్యాక్రాంతమైనా సహించేది లేదు

అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి శ్రీ పొంగులేటి గారు హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్ సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్దంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని , స్థానిక ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రిగారి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిశ్రమలు ఐటి శాఖలు, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీ డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ముఖ్యమైనదని అన్నారు. ఇది చాల పకడ్బందీగా అమలవుతున్నదని ఈ పథకాన్ని ఇదే విధంగా ముందుకు తీసుకెళ్లాలని, పట్టణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పేదరికమే అర్హతగా లబ్దిదారుల ఎంపిక చేపడుతున్నామని ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదని స్పష్టం చేశారు. తాము ఎలాంటి భేషజాలకు పోవడం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. కలెక్టర్లు ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. శాసనసభ స్పీకర్ శ్రీ జి. ప్రసాద కుమార్ మాట్లాడుతూ శాసనసభలో తీసుకున్న నిర్ణయం మేరకు సమావేశాలు నిర్వహించడం పట్ల మంత్రిగారికి అభినందనలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలా గొప్పగా అమలు అవుతున్నదని, జిల్లా స్థాయిలో కలెక్టర్లు ప్రతివారం ఈ పథకాన్ని సమీక్షించి పేదలకు మేలు కలిగేలా చూడాలన్నారు.

## బాధితులకు 10 సెల్ ఫోన్లు అందజేత

పిడుగురాళ్ల, పల్నాడు జిల్లా ఎస్పి కృష్ణారావు ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పోలీస్ శాఖ 2023 ు 2024, 2025, 2026 సంవత్సరనీ లో తమ సెల్ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల సెల్ ఫోన్ లను కనుగొని మొత్తం 10 సెల్ ఫోన్ లను మంగళవారం బాధితులకు పిడుగురాళ్ల సిఐ ఎస్ వెంకట్రావు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. దీంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ, పల్నాడు జిల్లా ఎస్పి కి మరియు పిడుగురాళ్ల సిఐ ఎస్. వెంకట్రావు కి స్థానిక పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# చంచల్గూడలో తెలంగాణ జైలు మ్యూజియం మరియు "ఫీల్ ది జైల్ ఎక్స్పీరియన్స్/జైల్ అనుభవం"ను ప్రారంభించిన తెలంగాణ గవర్నర్

హైదరాబాద్, మే 12, 2026:తెలంగాణ రాష్ట్ర గవర్నర్ Shiv Pratap Shukla ఈరోజు హైదరాబాద్లోని చంచల్గూడలో తెలంగాణ జైలు మ్యూజియం మరియు ప్రత్యేకమైన "ఫీల్ ది జైల్ ఎక్స్పీరియన్స్ / జైల్ అనుభవం" కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తెలంగాణ జైలు మ్యూజియం స్థాపన రాష్ట్ర కారాగార పరిపాలన చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఒకప్పుడు భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా జైళ్లు ప్రధానంగా శిక్షా కేంద్రాలుగా ఉండేవని, ఖైదీలు తీవ్రమైన శారీరక, మానసిక కష్టాలను అనుభవించేవారని అన్నారు. అలాంటి కఠినమైన జైలు విధానాలు స్వాతంత్ర్యం అనంతరం కూడా కొనసాగినట్లు గుర్తుచేశారు.

కాలక్రమేణా జైలు వ్యవస్థలు శిక్షా కేంద్రాల నుంచి సంస్కరణ, పునరావాసం, మానవీయత, గౌరవం కలిగిన మార్పు కేంద్రాలుగా రూపాంతరం చెందాయని గవర్నర్ తెలిపారు. ఆ పరిణామ క్రమాన్ని తెలంగాణ జైలు మ్యూజియం అద్భుతంగా ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

ఈ వినూత్న కార్యక్రమాన్ని రూపకల్పన చేసి అమలు చేసిన తెలంగాణ కారాగార శాఖను గవర్నర్ అభినందించారు. ముఖ్యంగా Dr. Soumya Mishra, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ & కరెక్షనల్ సర్వీసెస్, తెలంగాణ గారిని మరియు ఆమె బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

మ్యూజియం కేవలం చారిత్రక వస్తువుల సమాహారం మాత్రమే కాకుండా, న్యాయం, శిక్ష, సంస్కరణ మరియు మానవీయ మార్పు యొక్క జీవంతమైన చరిత్రగా నిలుస్తుందని గవర్నర్ తెలిపారు. పెయింటింగ్ గ్యాలరీలు, పాత జైలు బ్యారక్కుల నమూనాలు, గొలుసులు, సంకెళ్లు, ఉరికంబాలు, అరుదైన జైలు వస్తువులు, ఆడియో–విజువల్ ప్రదర్శనలు ద్వారా పూర్వకాల జైలు జీవితం మరియు ఆధునిక సంస్కరణాత్మక జైలు వ్యవస్థల పరిణామాన్ని ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు.

"ఫీల్ ది జైల్ ఎక్స్పీరియన్స్ / జైల్ అనుభవం" కార్యక్రమం ద్వారా ప్రజలకు జైలు జీవితం, క్రమశిక్షణ, ఖైదీల పరిస్థితులు, కారాగార పరిపాలనపై అవగాహన పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇది చట్టాల పట్ల గౌరవం, బాధ్యత, మానవీయత మరియు సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.

తెలంగాణ కారాగార శాఖ ఖైదీల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, జైలు పరిశ్రమలు, వ్యవసాయం, పునరావాస కార్యక్రమాలు, సమాజంలో పునఃకలయిక వంటి రంగాల్లో చేపడుతున్న సంస్కరణాత్మక చర్యలను గవర్నర్ అభినందించారు.

ఈ కార్యక్రమంలో ప్రసంగించిన Dr. Soumya Mishra తెలంగాణ జైలు మ్యూజియం అవగాహన, విద్య, పరిశోధన, చారిత్రక అధ్యయనం కోసం సమగ్ర కేంద్రంగా అభివృద్ధి చేయబడిందని తెలిపారు. సంగారెడ్డి జైలు మ్యూజియం పాత భవనాలు దెబ్బతినడంతో ఆ మ్యూజియం మూసివేయబడిందని, అనంతరం ఆధునిక రూపంలో చంచల్గూడలో ఈ మ్యూజియాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు.

ప్రాచీన శిక్షా విధానాల నుంచి ఆధునిక సంస్కరణాత్మక కారాగార వ్యవస్థల వరకు జరిగిన పరిణామాన్ని వివిధ గ్యాలరీలు, పాత జైలు నమూనాలు, చారిత్రక వస్తువులు, శిక్షా విధానాల ప్రదర్శనలు, పునరావాస కార్యక్రమాల ద్వారా మ్యూజియం చూపిస్తోందని ఆమె వివరించారు.

నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణ సమయంలో (1961--1968) ఖైదీలు ఓపెన్ ఎయిర్ జైల్లో ఉండి దేశ నిర్మాణంలో చేసిన సేవలను మ్యూజియంలోని ప్రత్యేక విభాగం ప్రదర్శిస్తోందని తెలిపారు.

"జైల్ అనుభవం / ఫీల్ ది జైల్ ఎక్స్పీరియన్స్" కార్యక్రమం ద్వారా ప్రజలకు 24 గంటలు / 12 గంటల చెల్లింపు ఆధారిత జైలు అనుభవం కల్పిస్తున్నామని, ఇందులో జైలు వసతి, జైలు భోజనం, క్రమశిక్షణ, రోజువారీ కార్యకలాపాలు, నియంత్రిత జైలు జీవన విధానం ఉంటాయని వివరించారు.

ఈ కార్యక్రమం వినోదం కోసం కాకుండా అవగాహన, సహానుభూతి, బాధ్యత, మానవీయ విలువలు మరియు కారాగార సంస్కరణలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

ఈ మ్యూజియం మరియు అనుబంధ కార్యక్రమాలు ప్రజా అవగాహన, జైలు సంస్కరణలు, పునరావాస కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలవడమే కాకుండా పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాలు, ఖైదీల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధికి కూడా దోహదపడతాయని డీజీ తెలిపారు.

ప్రజల సందర్శనల కోసం మరియు ఆన్లైన్ స్లాట్ బుకింగ్స్ కోసం అధికారిక వెబ్సైట్ www.telanganajailexperience.com ప్రారంభించినట్లు ఆమె తెలిపారు.

సందర్శకుల కోసం కేఫెటీరియా సౌకర్యం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. మరిన్ని వివరాలు మరియు బుకింగ్స్ కోసం ఈమెయిల్: telanganafeelthejail@gmail.com ఫోన్: 091 94946 32046 ను సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో శ్రీ ఎన్. మురళీ బాబు, ఐజీ ప్రిజన్స్; డాక్టర్ డి. శ్రీనివాస్, డీఐజీ ప్రిజన్స్ హైదరాబాద్ రేంజ్; ఎం. సంపత్, డీఐజీ ప్రిజన్స్ వరంగల్ రేంజ్; ఎస్. శివకుమార్ గౌడ్, సూపరింటెండెంట్ సెంట్రల్ ప్రిజన్ చంచల్గూడ; డి. భరత్, సూపరింటెండెంట్ PAC చెర్లపల్లి; జి. ప్రమోద్, సూపరింటెండెంట్ సెంట్రల్ జైలు చెర్లపల్లి; శ్రీమతి టి. లక్ష్మీ శ్రీనాథ్, సూపరింటెండెంట్ స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్ హైదరాబాద్; ఎస్. శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ SICA తదితర అధికారులు, సిబ్బంది, ఆహ్వానితులు మరియు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



హైదర బాద్ మే 12 హైదరాబాద్లోని సీఈఓ కార్యాలయం నుంచి, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు)తో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పై చర్చించేందుకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు .

భారత ఎన్నికల సంఘం త్వరలో ఎస్ఐఆర్ తేదీలను ప్రకటించనున్నందున, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, ఈ నెలాఖరులోగా 90 శాతం పురోగతిని సాధించాలని ఆయన కలెక్టర్లు, డీఈఓలను ఆదేశించారు. మ్యాపింగ్ కోసం నివాస సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీల సహాయం తీసుకోవాలని రెడ్డి అధికారులను కోరారు. ఈఆర్ఓలు, అసిస్టెంట్ ఈఆర్ఓలు, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) సూపర్వైజర్, బీఎల్ఓలతో కలిసి ఆయా ప్రాంతాల ప్రతినిధులతో గేటెడ్ కమ్యూనిటీలు, మురికివాడలను సందర్శించాలి . మ్యాపింగ్ దశలో ఓటర్లకు మార్గనిర్దేశం చేసేందుకు ముందుజాగ్రత్త చర్యగా సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన డీఈఓలు, ఈఆర్ఓలు, పర్యవేక్షక అధికారులను కోరారు. తమ నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు స్వయం సహాయక బృందాలు, రేషన్ షాపు డీలర్లు, ఉద్యోగ సంఘాలను కూడా భాగస్వాములను చేయాలని రెడ్డి కోరారు.

మరణించిన, వలస వెళ్లిన, శాశ్వతంగా తరలివెళ్లిన ఓటర్లపై దృష్టి సారించాలని, ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభావవంతమైన నివాసితుల మ్యాపింగ్ను ప్రారంభించాలని సీఈఓ రెడ్డి వారిని కోరారు.

# రామ తత్వ ప్రచారం తోనే లోక కళ్యాణం



హైద్రాబాద్ మే 12 ;రామ తత్వ ప్రచారం తోనే లోక కళ్యాణం అని రామ కథ ప్రచారకుడు మోహిత్ చరణ్ జి మహారాజ్ అన్నారు. అయోధ్యహనుమాన్ జయంతి సందర్భంగా ఖైరతాబాద్ లోని ఆంజనేయస్వామి దేవాలయంలో మాతృదేవోభవ సత్సంగ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భక్తి సంగీత కార్యక్రమంలో అయోధ్య నుంచి వచ్చిన మోహిత్ చరణ్ జి మహారాజ్ భక్తి సంగీత కార్యక్రమం ద్వారా రామ భక్తి రామ తత్వ విలువలను తెలుపుతూ ప్రపంచ శాంతికి గాని లోక కళ్యాణానికి గాని రామ తత్వమే శరణ్యమని తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు ఆర్యవైశ్య సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీర బొమ్మ రమేష్ మాట్లాడుతూ ముఖ్యంగా యువతలో రామ తత్వాన్ని ప్రచారం చేయటం వల్ల చెడు అలవాట్లకు దూరమై మంచి మార్గంలో పయనించి ఉన్నతమైన మార్గంలో జీవిస్తారని తెలిపారు గౌరవ అతిథిగా విచ్చేసిన సుధాకర్ గుప్తా మాట్లాడుతూ రామ తత్వ ప్రచారం వల్ల ప్రపంచ దేశాల్లో కూడా కాంతి చేకూరుస్తుందని తెలిపారు కార్యక్రమంలో మాతృదేవోభవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షులు కేబీ శ్రీధర్ రెండు రాష్ట్రాల సెక్రటరీ విజయ కనకదుర్గ వర కుమార్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వపు మెదక్ జిల్లాలలో పనిచేస్తున్న మాజీ మరియు ప్రస్తుత పాత్రికేయులకు రెండుసార్లు అక్రమంగా భూములు, ఇంటి స్థలాలను కేటాయింపు

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ని కలిసి వినతి పత్రం

## సమగ్ర విచారణ జరిపి, అవసరమైన తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలి

## తెలంగాణ యునైటెడ్ సిటిజన్ ఫోరమ్ మెదక్ జిల్లా కన్వీనర్ పల్లె అంజనేలు డిమాండ్



**సంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:**సంగారెడ్డి మే 12; సంగారెడ్డి జిల్లా, పూర్వపు మెదక్ జిల్లాలలో 1990 నుండి 2026 వరకు పనిచేస్తున్న మాజీ మరియు ప్రస్తుత పాత్రికేయులకు రెండుసార్లు అక్రమంగా భూములు, ఇంటి స్థలాలను కేటాయించడంపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైన తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ యునైటెడ్ సిటిజన్ ఫోరమ్ మెదక్ జిల్లా కన్వీనర్ పల్లె అంజనేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా మేజిస్ట్రేట్ మరియు కలెక్టర్, సంగారెడ్డి ని కలిసి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో పలువురు పాత్రికేయులు వాస్తవాలను అణచివేసి, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడం ద్వారా రెండు ఇళ్ల స్థలాలను పొందుతున్నారనే ఆరోపణల విషయంపై మీ పరిశీలన మరియు అవసరమైన కఠిన చర్యల [illegible] తెలంగాణ సిటిజన్ ఫోరం ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

1990 నుండి 2026 వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో కొంతమంది పాత్రికేయులకు రెండుసార్లు, చట్టవిరుద్ధంగా భూమి మరియు ఇంటి స్థలాలను కేటాయించడంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

గౌరవనీయ లోకాయుక్త వారు 29.12.2009 నాటి ఉత్తర్వులో, ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేస్తున్న పాత్రికేయులకు, ముఖ్యంగా స్టాఫ్ రిపోర్టర్లకు వారి భార్యలు, తల్లులు మరియు బంధువుల పేర్లతో ఇంటి స్థలాల కేటాయింపులో అవకతవకలు జరిగినట్లు నిర్ధారించబడిన విషయం పల్లె అంజన్న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

జాబితాలో పేర్కొన్నటువంటి అవకతవకలకు పాల్పడిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ను, వారు అక్రమంగా కేటాయించుకున్న/పొందిన గృహ స్థలాలను రద్దు చేయడంతో సహా వారిపై చర్యలు తీసుకోవాలని గౌరవనీయ లోకాయుక్త కూడా సిఫార్సు చేశారు. అయితే, ఈ విషయాలు వెలుగులోకి వచ్చినప్పటికీ, జిల్లా యంత్రాంగం ఇప్పటివరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు, వారి గుర్తింపును కూడా రద్దు చేయలేదని పేర్కొన్నారు.

ఈ వేసలుబాటును ఆసరాగా తీసుకుని, కొంతమంది పాత్రికేయులు సంగారెడ్డి జిల్లా, రామచంద్రపురం మండలం, కొల్లూరు గ్రామంలోని సర్వే నెం. 191/1లో ఉన్న మూడు ఎకరాల భూమిని జిల్లా పాత్రికేయుల సహకార గృహ నిర్మాణ సంఘం పేరుతో అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయని, అదేవిధంగా, సర్వే నెం. 191/2 లోని మరో మూడు ఎకరాల భూమిని జిల్లా పాత్రికేయుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం పేరు మీద పొందడం జరిగింది, దానిని తదనంతరం ప్లాట్లుగా మార్చి రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు.

ఈ తీవ్రమైన ఆరోపణలు మరియు అవకతవకల దృష్ట్యా, దోషులుగా తేలిన జర్నలిస్టులపై సమగ్ర దర్యాప్తు, విచారణ జరిపి, తగిన న్యాయపరమైన చర్యలు ప్రారంభించాలని సిటిజన్ ఫోరమ్ విజ్ఞప్తి చేస్తోంది. అంతేకాకుండా, జిల్లాలోని పలు ఇతర ప్రాంతాల్లో అక్రమంగా ప్లాట్లు పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో, ఇప్పటి వరకు ఒక్క ప్లాట్ కూడా పొందని, అర్హులైన ఎంతోమంది జర్నలిస్టులు అటువంటి ప్రయోజనాలకు దూరమై అన్యాయానికి గురయ్యారు. అందువల్ల, ఈ విషయాలపై విచారణ జరపాలని, అర్హులైన పాత్రికేయులకు న్యాయబద్ధంగా గృహ స్థలాలను కేటాయించాలని, మరియు అవినీతి, అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం అవసరమైన కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ యునైటెడ్ సిటిజన్ ఫోరమ్ డిమాండ్ చేసింది.

# బండి సంజయ్ ను మంత్రి పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలి

## బండి భగీరథ ను తక్షణమే అరెస్టు చేయాలి

## ప్రగతి శిలా మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు సంపంగి పద్మక్క డిమాండ్




హైద్రాబాద్ మే 12 ;బాలీ కాకు మద్యం తాగించి లైంగికదాడికి పాల్పడిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు,బండి సాయి భగీరథ ను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రగతి శిలా మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు సంపంగి పద్మక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బాధిత కుటుంబ పై తప్పుడు కేసు పెట్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ను తక్షణమే బర్త్ రఫ్ చేయాలి అని డిమాండ్ చేశారు బదిరాలి పిర్యాదు స్వీకరించడంలో

పోలీసు లకు 8 గ ల టైమ్ పట్టింది,దిన్ని బట్టి పోలీసుల వైఖరి ఏమిటో అర్థం అవుతుంది,చట్టం ముందు అందరూ సమానమే ,అనే రాజ్యాంగ పరిధిలో పోలీస్ కూడా ఉండాలన్నారు,

బండి భగీరథ తన తండ్రి అండతో విద్యా సంస్థలో,ర్యాగింగ్,దాడులు,మద్యం,మత్తులో అనేక అరాచకాలకు పాల్పడ్డారని ఆరోపించారు,బాలిక పై లైంగిక దాడి చేయడమే కాకుండా తమను హాని ట్రాప్ చేశారని కేసును తప్పు దోవ పట్టిస్తున్నారు అని విమర్శించారు

బే టీ బచావో, బే టీ పడవు వంటి అనేక నినాదాలు ఈ స్తున్న బీజేపీ సంస్కారం,రేపిస్టులకు సత్కారాలు చేయడంలోనే వీరి ప్రబుద్ధి తెలుస్తుంది, కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవిని ఉపయోగించు కొని కేసును ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తారని ఆమె ఆవేదన వెలిబుచ్చారు,బాధిత కుటుంబ స్నీ బెదిరిస్తున్నారని,బాలికకు ప్రాణహాని పొంచి ఉందన్నారు

# ఉమెన్స్ కాలేజీ.. సైన్స్ ల్యాబ్ ప్రారంభించిన టి ఎస్ ఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



హైద్రాబాద్ మే 12; గోషామహల్ నియోజకవర్గం... ప్రఖ్యాత కోఠి వీర నారి చాకలి ఐల్లమ్మ ఉమెన్స్ కాలేజీ.. సైన్స్ ల్యాబ్ ను టి ఎస్ ఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో వైస్ ఛాన్సెలర్ సూర్య ధనుంజయ సిబ్బంది.. అధికారులు.. విద్యార్థులు పాల్గొన్నారు

# పరుగులు పెడుతున్న అమరావతి

విజయవాడ, మే 12, అమరావతి రాజధాని నిర్మాణ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. 2028 నాటికి తొలి దశ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉంది ప్రభుత్వం. ఒక రూపం తీసుకువచ్చి ఎన్నికలకు వెళ్లాలన్నది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ఓటమి వచ్చిన తర్వాత అమరావతి పునర్నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. అమరావతిని ప్రపంచ నగరాల్లో ఒకటిగా నిలపాలన్నది చంద్రబాబు ఆలోచన. ఆ వ్యూహానికి తగ్గట్టు పనులు జరుగుతున్నాయి. అయితే ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలోనే అమరావతిపై చర్చ జరిగేది. కానీ ఇప్పుడు జాతీయ స్థాయిలో సైతం అమరావతిపై చర్చ జరుగుతోంది. దేశంలోని ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, జర్నలిస్టులు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో జాతీయస్థాయిలో విస్తృత ప్రచారం జరుగుతోంది అమరావతి నిర్మాణంలో సాంకేతిక అంశాలను జోడిస్తోంది ప్రభుత్వం. ప్రధానంగా గ్రిడ్ తరహా డిజైన్, కృష్ణానది తీరాన అభివృద్ధి చెందుతున్న జోనల్ సిస్టం ఇప్పుడు ప్రచారంలోకి వస్తోంది. ప్రముఖ యూట్యూబర్ రాజన్ సింగ్ అమరావతి పనులపై రూపొందించిన వీడియో విపరీతంగా వైరల్ అవుతోంది. దేశ ప్రజలను ఆకర్షిస్తోంది. కేవలం సంక్షేమ పథకాలు కాదు.. శాశ్వతమైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాధాన్యతను అమరావతి నిరూపిస్తోందని ఈ వీడియో చూసిన వారు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు ఏపీలో సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే.. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీగా అమరావతిని రూపుదిద్దుతున్నారు. ఇప్పటికే ప్రతిష్టాత్మక యూనివర్సిటీలు, ప్రపంచ స్థాయి విద్యాసంస్థల క్యాంపస్లు అమరావతిలో నెలకొల్పుతున్నారు. ఇదే విషయాన్ని చెబుతున్నారు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు.ప్రస్తుతం ఎండలకు తీవ్రత అధికంగా ఉంది. అమరావతి చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే ఈ ఎండల్లో సైతం అమరావతి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు ఎండలను కూడా లెక్క చేయకుండా జాతీయస్థాయి ఇన్ఫ్లుయెన్సర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి.. అక్కడ జరుగుతున్న అద్భుతమైన మౌలిక వసతుల కల్పనను రికార్డ్ చేస్తున్నారు. అత్యాధునిక రవాణా సౌకర్యాలు, విశాలమైన రహదారులు, పక్కాగా విభజించిన నివాస, వాణిజ్య జోన్లను చూసి ఇండియాలోనే అద్భుత నగరం అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. రాబోయే తరాలకు ఒక ఆదర్శప్రాయమైన మాడల్ అవుతుందని ఎక్కువమంది కామెంట్స్ చేస్తున్నారు. జాతీయ మీడియాలో సైతం ప్రత్యేక కథనాలు వస్తున్నాయి. తద్వారా అమరావతిలో పెట్టుబడులు పెడుతున్న ప్రైవేటు సంస్థలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

# మురిగిపోతున్న కేంద్రనిధులు

విజయవాడ, మే 12, కేంద్ర నిధులను సకాలంలో వినియోగించకపోవటంతో ఏపీ భారీగా నష్టపోయింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిక పథకాల ద్వారా కేంద్రం ఏపీకీ రూ.15031 కోట్లు కేటాయించింది. అయితే ఇందులో కేవలం 9980 కోట్లు మాత్రమే వినియోగించుకున్నారు. సకాలంలో సక్రమంగా వినియోగించుకోకపోవటంతో రూ.5000 కోట్లకుపైగా నిధులు మురిగిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు కేంద్ర నిధులను సకాలంలో వినియోగించుకోవాలని ప్రభుత్వం అధికారులకు స్పష్టం చేసింది.కేంద్ర ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించుకోకపోవటంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారీగా నష్టపోయింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రాయోజిక పథకాలు (సీఎస్ఎస్) కింద అందిన నిధులలో సక్రమంగా వినియోగించని కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రూ.5000 కోట్లకు పైగా కోల్పోయింది. ఈ నేపథ్యంలో కేంద్ర నిధులను సకాలంలో వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగాలను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగించటంపై దృష్టి పెట్టాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీలను ఆదేశించారు.2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం 79 పథకాల కింద రాష్ట్రానికి రూ.15,031 కోట్లు కేటాయించింది. అయితే ఇందులో కేవలం రూ. 9980 కోట్లను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంది. 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఏపీకి రూ.15,031 కోట్లు కేటాయించిందన్న ఏపీ ఆర్థికశాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్.. ఇందులో రూ. 11,465 కోట్లు విడుదల చేసిందన్నారు. కేంద్రం చేసిన మొత్తం కేటాయింపులో దాదాపు 76 శాతానికి సమానంగా వెల్లడించారు.కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా నిధులు సకాలంలో విడుదలైనప్పటికీ, రాష్ట్రం కేవలం రూ. 9,980 కోట్లను మాత్రమే వినియోగించుకోగలిగిందని.. పలు పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిధుల గడువు ముగిసిందని వివరించారు. బడ్జెట్ అంచనాల్లో మార్పులు, నాలుగో త్రైమాసికంలో నిధులు విడుదల కాకపోవటం, కొన్ని శాఖలలో తక్కువగా నిధుల వినియోగం, కేంద్రానికి పంపించిన బిల్లుల తిరస్కరణ వంటి కారణాలతోనే నిధులు కోల్పోయినట్లు వెల్లడించారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందని.. ఇలాంటి లోపాలు జరగకూడదని అధికారులను హెచ్చరించారు. అలాగే, ఖర్చులను నిశితంగా పర్యవేక్షించడం, బిల్లులను సకాలంలో సమర్పించడం తప్పనిసరని స్పష్టం చేశారు.ఇక నిధుల వినియోగంలో న్యాయ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ శాఖలు, ఉన్నత విద్య విభాగం ముందున్నాయి. జిల్లాల సంగతికి వస్తే అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలు 99 శాతం నిధుల వినియోగంతో అన్నింటి కంటే ముందున్నాయి. ఇక అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు జిల్లాలు నిధుల వినియోగంలో వెనుకబడ్డాయి.

పెండింగ్‌లో ఉన్న నిధులలో అధిక భాగం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ప్రధాన మంత్రి పోషణ, అంగన్‌వాడీ సంబంధిత పథకాలకు చెందినవేనని ఏపీ ఆర్థికశాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్ తెలిపారు. మార్చి 2026 చివరి వారంలో సమర్పించిన రూ. 828 కోట్ల విలువైన బిల్లులు సాంకేతిక లోపాల కారణంగా, కేంద్ర మంత్రిత్వ శాఖలలో నిధుల కొరత వల్ల తిరస్కరించారని వివరించారు.

# విజయ్ టీమ్ లో ఎవరీ విష్ణురెడ్డి...

తిరుపతి, మే 12, తమిళనాడు రాజకీయాల్లో తెలుగు వ్యక్తుల గురించి ఇటీవల సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. తమిళనాడు సీఎం విజయ్ మంత్రివర్గంలో శివకాశి ఎమ్మెల్యే కీర్తనకు అవకాశం దక్కటంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. అలాగే ప్రమాణ స్వీకారానికి ముందు టీవీకే చీఫ్ విజయ్.. తమిళనాడు గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను కలిసిన ఫోటో కూడా సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతోంది. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ విజయ్ గవర్నర్‌ను కోరేందుకు వెళ్లిన సమయంలో పలువురు విజయ్ వెంట ఉన్నారు. ఈ క్రమంలోనే అందులో ఉన్న విష్ణు రెడ్డి అనే వ్యక్తి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు.ఎవరీ విష్ణు రెడ్డి.. సోషల్ మీడియాలో ఈ వ్యక్తిపై ఇటీవల విపరీతంగా చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఆహ్వానించాలంటూ టీవీకే అధినేత విజయ్.. గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను కలిసిన సమయంలో విష్ణు రెడ్డి అక్కడే ఉన్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కావటంతో.. ఎవరీ విష్ణు రెడ్డి అనే చర్చ మొదలైంది. ఈ క్రమంలోనే ఈయన ఏపీకి చెందినవారని.. ఏపీ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డికి సమీప బంధువు అవుతారని.. బావమరిది అవుతారంటూ వార్తలు వస్తున్నాయి.టీవీకే అధినేత విజయ్‌కు అత్యంత నమ్మకస్తుడు, సన్నిహితుడిగా పేరొందిన విష్ణువర్ధన్ రెడ్డి గురించి తమిళ మీడియాతో పాటు తెలుగు మీడియాలోనూ చర్చ జరుగుతోంది. ఈయన పేరు ఎర్రదొడ్డి విష్ణువర్ధన్ రెడ్డి. గ్రానైట్ క్వారీల వ్యాపారం చేస్తుంటారు. ఈయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా కలికిరి మండలం ఎర్రదొడ్డిపల్లె. పదిహేనేళ్లుగా గ్రానైట్ వ్యాపారం చేస్తున్న విష్ణు రెడ్డి.. చెన్నైలోనే స్థిరపడ్డారు. విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబానికి పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. ఈయన తండ్రి రామనారాయణరెడ్డి వైఎస్ ఎంపీపీగా గతంలో పనిచేశారు. అద్దవారిపల్లె సర్పంచ్, మహల్ ఎంపీటీసీ, కలికిరి మండలానికి వైస్ ఎంపీపీగానూ వ్యవహరించారు.మరోవైపు విష్ణు రెడ్డి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి సమీప బంధువు కావటం విశేషం. విష్ణు రెడ్డి తల్లి, రామనారాయణ రెడ్డి భార్య.. కలికిరి మాజీ ఎంపీపీగా పనిచేసిన నల్లారి ఆనంద రెడ్డికి సోదరి అవుతారు. అలాగే నల్లారి ఆనంద రెడ్డికి, కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబానికి బంధుత్వం ఉంది. కిరణ్ కుమార్ రెడ్డి సోదరిని ఆ కుటుంబంలోని వారికే ఇచ్చి పెళ్లి చేశారు. దీంతో కిరణ్ కుమార్ రెడ్డికి విష్ణువర్ధన్ రెడ్డికి బంధుత్వం ఏర్పడింది. కిరణ్ కుమార్ రెడ్డికి విష్ణు రెడ్డి వరుసగా బావమరిది అవుతారు.మరోవైపు టీవీకే చీఫ్ విజయ్‌కు విష్ణు రెడ్డి అత్యంత సన్నిహితుడని సమాచారం. టీవీకేకు వ్యూహకర్త ఆయనేనని.. సోషల్ మీడియా నిర్వహణ, ఆర్థిక వ్యవహారాల్లోనూ విజయ్ పార్టీకి అండగా ఉన్నారని తమిళ మీడియాలో చర్చ జరుగుతోంది. విజయ్ సినిమాల పర్యవేక్షణలోనూ విష్ణు రెడ్డి పాత్ర ఉంటుందంటూ ప్రచారం జరుగుతోంది.

# జనసేనలో ఇంచార్జీల లొల్లి...

గుంటూరు, మే 12,జనసేన పార్టీకి కొత్త తలనొప్పి ప్రారంభం అయింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా 11 మందిని ఇన్చార్జులుగా నియమించారు పవన్ కళ్యాణ్. రాయలసీమతో పాటు ప్రకాశం,నెల్లూరు బాధ్యతలను బాలినేని శ్రీనివాస్ రెడ్డి తో పాటు మరో ఇద్దరు నేతలకు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు వంటి వాటిపై పార్టీ క్యాడర్ అభిప్రాయాలు సేకరించాల్సిన పని ఈ కమిటీకి ఉంది. అందులో భాగంగా రాయలసీమ రీజియన్కు సంబంధించి సమావేశం నిర్వహించగా రచ్చకు దారితీసింది. పార్టీలో కీలక నాయకులుగా ఉన్న వారిని వ్యతిరేకిస్తూ.. కొందరు నాయకులు బహిరంగ విమర్శలు చేశారు. సమావేశం నిర్వహణను కూడా బహిష్కరించారు. దీంతో ఇప్పటివరకు జనసేన లో ఉన్న అంతర్గత విభేదాలు బయటపడ్డాయి.పార్టీలో ప్రారంభం నుంచి ఉన్న నేతలకంటే పక్క పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం లభిస్తుందన్న టాక్ జనసేనలో ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వారితోనే ఇటువంటివి జరుగుతున్నాయని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. అటువంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వాస్తవంగా చెప్పాలంటే మాజీ మంత్రి బాలినేని వ్యతిరేకిస్తూ గళం విప్పారు ఎక్కువ మంది నేతలు. బాలినేని రాకను జనసేన లోని ప్రధాన వర్గం వ్యతిరేకిస్తూ వస్తోంది. ఈ క్రమంలో బాలినేని నియామకం, అదే నేత సమావేశం నిర్వహించడాన్ని ఆయన వ్యతిరేకులు తట్టుకోలేకపోయారు.ఇంకోవైపు ఇదే కమిటీ లో ఉన్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ హరిప్రసాద్ మధ్య కూడా విభేదాలు ఉన్నాయి. ఇదే సమావేశంలో ఒకరికొకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. ఈ పరిణామాలతో బాలినేని సహా అందరూ విస్తు పోయారు. అయితే ప్రధానంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేన లో చేరిన నేతలతోనే ఈ పరిస్థితి అని అర్థమవుతోంది. ఎందుకంటే బాలినేని సైతం వైసీపీ నుంచి వచ్చి జనసేనలో చేరారు. ఎన్నికల ముందు ఆరని శ్రీనివాసులు సైతం వైసీపీ నుంచి జనసేన లోకి వచ్చారు. అయితే పార్టీ ఆవిర్భావం నుంచి వచ్చిన నేతలకు ఎటువంటి ప్రాధాన్యం లేదు. దీంతో పార్టీలో విభేదాలు పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. ఇలా అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన నెగ్గుకు రావడం మాత్రం కష్టం.

# ఈ వారం వానలే..

## గుడ్ న్యూస్ చెప్పిన వెదర్ మ్యాన్

విశాఖపట్టణం, మే 12, ఏపీ ప్రజలకు బిగ్ రిలీఫ్.. రాష్ట్రంలో మరో వారం రోజుల్లో వర్షాలు కురవనున్నాయి. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మరో వారం రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. మరోవైపు రోజున పలు జిల్లాలలో పిడుగులతో కూడిన తేలికపాటి వానలు పడతాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వారం రోజులలో వర్షాలు కురవనున్నట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. వారం రోజుల్లో తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకొని శ్రీలంక పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతోందన్న విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు.. ఈ అల్పపీడనం మరికొన్ని గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనానికి అనుబంధంగా.. 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. దీంతో వారం రోజుల్లో ఏపీలో వర్షాలు కురిసే అవకాశంఉందన్నారు. గడిచిన 24 గంటల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అత్యధికంగా 3.24 సెం.మీ వర్షం కురిసినట్లు వెల్లడించారు.మరోవైపు ఉత్తర శ్రీలంక తీరము, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని ప్రభావంతో మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా , పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు ,కృష్ణా జిల్లా, ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, బాపట్ల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.మరోవైపు అల్లూరి జిల్లా జికే వీధి, ముంచింగిపుట్టు, పెదబయలు మండలాలతో పాటుగా పోలవరం జిల్లా చింతూరు, కూనవరం, మారేడుమిల్లి, వరరామచంద్రాపురం, గుర్తేడు మండలాల్లో మంగళవారం రోజున వడగాలులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని వెల్లడించింది. విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. బహిరంగ ప్రదేశాల్లో ఉండొద్దని సూచించింది. రైతులు, కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

# వైద్యఆరోగ్యశాఖ ప్రక్షాళన...

## 51 మంది డిస్మిస్, 33 మందికి మెమోలు

విజయవాడ, మే 12, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ మంత్రి సత్యకుమార్ యాదవ్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన వైద్య పరికరాల కొనుగోళ్లలో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో, వీటిపై సమగ్ర విచారణకు ఆయన ఆదేశించారు. ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న శాఖలో అక్రమాలకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వైద్య పరికరాల సేకరణలో ఇకపై ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండకూడదని మంత్రి హెచ్చరించారు. కొనుగోళ్ల ప్రక్రియలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. టెండర్ల దగ్గర నుండి డెలివరీ వరకు ప్రతి దశలోనూ పారదర్శకత ఉండాలని, దీని కోసం అత్యాధునిక విధానాలను అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడడమే లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది పడుతున్న ఇబ్బందులపై మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపారు. వైద్య సిబ్బందికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న సర్వీసు పరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్యదర్శి సౌరభ్ గౌరవ్‌కు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఉద్యోగులు ఆందోళన చెందకుండా, వారి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, దీనివల్ల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరలో చేపట్టబోయే సాధారణ బదిలీల ప్రక్రియపై మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. బదిలీలు ఎటువంటి పైరవీలకు తావులేకుండా, అత్యంత సజావుగా సాగాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఉద్యోగికి న్యాయం జరిగేలా బదిలీల షెడ్యూల్ రూపొందించాలని, ఈ ప్రక్రియలో ఎక్కడా చిన్నపాటి అవాంతరాలు కూడా ఎదురుకాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

సొంత వ్యాపకాలతో డ్యూటీలకు గైర్హాజరు

మరో వైపు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న 51 మంది వైద్యులను విధుల నుంచి తొలగించినట్లు మంత్రి తెలిపారు. వీరిలో 8 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 41 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్ ప్రకారం ఏడాదికిపైగా విధులకు గైర్హాజరవుతున్న వారిని ఉద్యోగానికి రాజీనామా చేసినట్లుగా పరిగణించి చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. అయితే నేరుగా చర్యలు తీసుకోకుండా ముందుగా సంజాయిషీ నోటీసులు ఇచ్చి సమయం కూడా ఇచ్చామని వివరించారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో చివరకు తొలగింపు చర్యలు తీసుకున్నామన్నారు.విధుల నుంచి తొలగించిన వారిలో కొందరు చాలా కాలంగా ఆస్పత్రులకు రాకపోవడం బయటపడింది. ఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన ఓ అసోసియేట్ ప్రొఫెసర్ 2020 ఫిబ్రవరి నుంచి విధులకు హాజరుకావడం లేదని అధికారులు గుర్తించారు. మరికొందరు 2022 నుంచి కూడా విధులకు దూరంగా ఉన్నట్లు తేలింది. ట్యూటర్లలో ఒకరు ఏకంగా ఏడేళ్లుగా విధులకు రాకపోవడం సంచలనంగా మారింది. కడప, అనంతపురం, ఒంగోలు, తిరుపతి, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, నెల్లూరు, మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన వైద్యులు ఈ జాబితాలో ఎక్కువగా ఉన్నారు.ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. కొందరు వైద్యులు సొంత వ్యాపకాలు, ప్రైవేట్ ప్రాక్టీసులు చూసుకుంటూ ప్రభుత్వ విధులకు దూరంగా ఉన్నట్లు గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రెగ్యులర్ నియామకాల ద్వారా ప్రభుత్వ సేవల్లో చేరినప్పటికీ.. కొందరు ఆస్పత్రులకు రాకుండా వేతనాలు పొందుతున్నారన్న ఫిర్యాదులు చాలా కాలంగా వస్తున్నాయి. దీనివల్ల బోధనాసుపత్రుల్లో వైద్య సేవలు దెబ్బతింటున్నాయని ప్రభుత్వం భావించింది. ప్రత్యేకంగా మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నివేదికలు రావడంతో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది.వైద్యులు విధులకు హాజరుకాకపోవడంపై మంత్రి సీరియస్ కావడంతో డీఎంఈ అధికారులు పూర్తి స్థాయి తనిఖీలు చేపట్టారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి హాజరు వివరాలు తెప్పించారు. ఎవరు ఎంతకాలంగా విధులకు దూరంగా ఉన్నారు? ఎవరికి నోటీసులు ఇచ్చారు? ఎవరెవరు స్పందించారు? అనే అంశాలపై ప్రత్యేక జాబితా సిద్ధం చేశారు. తర్వాత నిబంధనల ప్రకారం తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మరో ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా చర్యలు ప్రస్తుతం తొలగించిన 51 మందిలో ప్రొఫెసర్లు లేరు. అయితే దీర్ఘకాలంగా విధులకు దూరంగా ఉన్న ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా త్వరలో చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మొత్తం ఐదుగురు ప్రొఫెసర్లు దీర్ఘకాలంగా గైర్హాజరైనట్లు గుర్తించగా.. నోటీసుల తర్వాత ఇద్దరు తిరిగి విధుల్లో చేరినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిపై చర్యలకు రంగం సిద్ధమవుతోందిఇంకా ఏడాది పూర్తి కాకపోయినా దీర్ఘకాలంగా విధులకు రాని మరో 33 మంది వైద్యులకు ఛార్జిమెమోలు జారీ చేశారు. వీరిలో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. ఇప్పటికే 11 మంది వైద్యులు నోటీసుల తర్వాత తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారు కూడా వెంటనే హాజరుకాకపోతే.. ఏడాది గడువు దాటిన తర్వాత వారిపైనా ఉద్వాసన చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. “బాధ్యతారాహిత్యాన్ని ఉపేక్షించం” విధుల నిర్వహణలో అలక్ష్యం, నిర్లక్ష్యం సహించబోమని మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉంటారని.. ఇష్టానుసారంగా విధులకు దూరంగా ఉండటం తీవ్రమైన విషయం అని పేర్కొన్నారు. “ప్రభుత్వ సేవలో ఉంటూ విధులకు హాజరుకాకపోవడం అనేది చిన్న విషయం కాదు. రోగులకు నష్టం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు? బాధ్యతారాహిత్యాన్ని ప్రభుత్వం ఉపేక్షించే పరిస్థితి లేదు” అని మంత్రి స్పష్టం చేశారు.ఒకవైపు గైర్హాజరు వైద్యులపై చర్యలు తీసుకుంటూనే.. మరోవైపు ఖాళీల భర్తీపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. జీరో వేకెన్సీ పాలసీ కింద వెంటనే నియామకాలు చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటోంది. బోధనాసుపత్రుల్లో వైద్యులు, అధ్యాపకుల కొరత లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పలు పోస్టుల భర్తీ ప్రక్రియ వేగవంతం చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ తాజా చర్యలతో బోధనాసుపత్రుల్లో డ్యూటీలకు గైర్హాజరు అయ్యే వైద్యుల్లో ఆందోళన మొదలైనట్లు తెలుస్తోంది. ఇకపై విధులకు డుమ్మా కొడితే కఠిన చర్యలు తప్పవన్న సంకేతాన్ని ప్రభుత్వం స్పష్టంగా ఇచ్చిందని వైద్య వర్గాలు భావిస్తున్నాయి.

# కంటోన్మెంట్ పనులపై

## ఎమ్మెల్యే సమీక్ష

సికింద్రాబాద్. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం ద్వారా కంటోన్మెంట్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరిన 303 కోట్ల రూపాయలతో కంటోన్మెంట్ ప్రాంతంలో చేపట్టనున్న నాలాలు, డ్రైనేజీల పునరుద్ధరణ పనులపై కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 303 కోట్ల రూపాయలు సమకూరి 6 నెలలు అవుతుందని, బోర్డుకు ఇంత పెద్ద మొత్తం సమకూరడం చరిత్ర అని, అన్ని డిపార్ట్మెంట్ ల అధికారులు సమన్వయం చేసుకుని శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లి నవ కంటోన్మెంట్ నిర్మాణానికి బాటలు వేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

## రోహ్యింగాలను అడ్డుకోవాలి



హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో బంగ్లాదేశ్ రొహ్యింగాలు చొరబడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు ఆరోపించారు. హైదరాబాద్ లక్డికపుల్ లోని రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో సమితి నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.రావినూతల శశిధర్ మాట్లాడుతూ... అక్రమ చొరబాటుదారులైన రొహ్యంగాలపై ఇతర రాష్ట్రాల్లో చర్యలు చేపడుతున్నారని , కానీ తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి చర్యలు లేవన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం ఇలా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రంలో అక్రమంగా ప్రవేశించిన రొహ్యంగాలను తిరిగి పంపించాలని డిమాండ్ చేశారు. అలాగే బక్రీద్ పండుగ సందర్భంగా హైదరాబాద్ ఓల్డ్ సిటీలో వేలాది గోవులను తరలించారని , గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

## కోదాడలోని బాలాజీ నగర్ వద్ద రోడ్డు ప్రమాదం



కోదాడలోని బాలాజీ నగర్ వద్ద ఒక లారీ టర్న్ అవర్ తీసుకుంటుండగా అటువైపు వస్తున్న బైక్ లారీని ఢీ కొట్టి లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జు అయిపోయింది. ప్రమాదంలో వాహనంపై వెళ్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు అప్రమత్తమై ట్రాఫిక్ ను కంట్రోల్ కంట్రోల్ చేశారు

## యువకుడి హత్య కేసును ఛేదించిన బాలాపూర్ పోలీసులు
## ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

రంగారెడ్డి హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు కేవలం 12 గంటల్లో చేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు.ఉస్మాన్ నగర్ ప్రాంతంలో అదిత్ పాండే ఏ భజరంగ్ (24) అనే యువకుడిని పాత కక్షల నేపథ్యంలో దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు మృతుడిని మద్యం తాగుదామని నమ్మబలికి పిలిపించి, అనంతరం అతనిపై ఇనుప రాడ్లు, రాళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు.ఈ కేసులో o1 సయ్యద్ ఇఫ్తేఖార్(25),o2 మహమ్మద్ సాహిల్(20),o3 అబ్దుల్లా బిన్ అమీర్(20) లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.నిందితులకు గతంలో వెహికల్ సీజ్ వ్యవహారంలో పరిచయం ఏర్పడినట్లు, అదే తర్వాత పాత కక్షలకు దారితీసి హత్యకు కారణమైనట్లు పోలీసులు తెలిపారు.సంఘటన అనంతరం ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టిన బాలాపూర్ పోలీసులు సాంకేతిక ఆధారాల సహాయంతో 12 గంటల్లోనే నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.అదేవిధంగా ముగ్గురు నిందితులపై డ్రగ్స్ టెస్టులు నిర్వహించగా వారికి పాజిటివ్ రావడంతో ఔఆఖా యాక్ట్ కింద కూడా అదనపు కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి తెలిపారు.

# వ్యూహం మారిన కమలం...
# కేవలం విజయమే మంత్రం



న్యూఢిల్లీ, మే 12, (న్యూస్ పల్స్) బీజేపీ ఎప్పటికప్పుడు తన వ్యూహాలను మార్చుకుంటోంది. గతంలో లాగా రాజకీయాలను చేయడం లేదు. మరీ ముఖ్యంగా మోదీ, అమిత్ షా ద్వయం వచ్చిన తర్వాత ఈ ట్రెండ్ పెరిగిపోయింది. గతంలో అత్యంత కీలకమైన ముఖ్యమంత్రి పీఠాన్ని కేవలం బీజేపీ నేపథ్యం వున్న వారికి మాత్రమే చాలా జాగ్రత్తగా ఇచ్చేవారు. కానీ.. ఇప్పుడు మాత్రం “కేవలం విజయ సూత్రం” పైనే ఆధారపడి, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు కూడా సీఎం పీఠం ఇచ్చేస్తున్నారు. బెంగాల్ లో సువేందు అధికారి ప్రమాణ స్వీకారం ఈ తాజా వ్యూహానికి తాజా ఉదాహరణ.తృణమూల్ నుంచి వచ్చినా.. సువేందు బీజేపీ క్రియాశీలక నేతల్లో ఒగరుగా మారిపోయారు. ఇలా ఇతర పార్టీల నుంచి వచ్చి, బీజేపీలో సీఎంలు.

1. సువేందు అధికారి :
సువేందు అధికారి గతంలో తృణమూల్ లో కీలక నేత. మమతా బెనర్జీకి నమ్మిన బంటు. కానీ.. 2002 లో ఆ పార్టీకి గుడ్ బై చెప్పేసి, బీజేపీలో చేరిపోయారు. ఇప్పుడు.. ఏకంగా బెంగాల్ లో బీజేపీ మొదటి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి చరిత్ర సృష్టించారు.

2. హిమంత బిస్వ శర్మ:
ఈ నేత కూడా గతంలో కాంగ్రెస్ లో వుండేవారు. అసోం కాంగ్రెస్ లో అత్యంత కీలక నేతగా వుండేవారు. కానీ.. రాహుల్ గాంధీతో వచ్చిన పొరపొచ్చాల కారణంగా 2015 లో పార్టీని వీడి, బీజేపీలో చేరిపోయారు. ఆ తర్వాత ఈశాన్య రాష్ట్రాల బీజేపీ వ్యవహారాల్లో అత్యంత కీలక నేతగా మారిపోయారు. బీజేపీ కూడా ఈయన తెలివి తేటలను గ్రహించి, ముఖ్యమంత్రిగా చేసింది.

3. పేమా ఖాండు :
అరుణాచల్ ప్రదేశ్ లో అత్యంత కీలక నేత. 2016 వరకూ కాంగ్రెస్ లో వుండేవారు. కానీ.. ఆ తర్వాత 43 మంది ఎమ్మెల్యేలతో కలిసి ఖఖం పార్టీలో చేరారు. రెండు నెలల తర్వాత, ఆయన ఖఖం నుండి కూడా విడిపోయి, 32 మంది ఎమ్మెల్యేలతో సహా ఃఏఖలో చేరారు.ఆ తర్వాత బీజేపీ నుంచి సీఎం అయ్యారు.

4. బీరెన్ సింగ్ :
మణిపూర్ లో ఈయన ఒకప్పుడు కాంగ్రెస్ సర్కార్ లో మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2016 లో బీజేపీలో చేరారు. 2017 లో మణిపూర్ లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమయంలో ఆయననే బీజేపీ ముఖ్యమంత్రిగా చేసింది.

5. మాణిక్ షాహ :
ఈయన త్రిపురలో కీలక నేత. కాంగ్రెస్ లో కీలకంగా వుండేవారు. 2016 లో కాంగ్రెస్ కి గుడ్ బై చెప్పేసి, బీజేపీలో చేరిపోయారు. 2020 నుంచి 2022 వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారు. ఆ తర్వాత 2022 లో బీజేపీ ఈయనను ముఖ్యమంత్రిగా చేసింది.

6. సామ్రాట్ చౌదరి :
సామ్రాట్ చౌదరి ఆర్జేడీ, జేడీయూలో కీలక నేతగా వుండేవారు. నితీశ్ కి, లాలూకి అత్యంత సన్నిహితుడు. అయితే 2017 లో బీజేపీలో చేరిపోయారు. తాజాగా బీజేపీ ఆయన్ను బిహార్ ముఖ్యమంత్రిని చేసింది.

# మత కల్లోలాల వ్యూహం

న్యూఢిల్లీ, మే 12, దేశవ్యాప్తంగా ఒకే రకమైన చిత్రం కనిపిస్తోంది.. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కడప వరకు, మత కల్లోలాల వెనుక దాగి ఉంది ఒక వ్యూహాత్మక రాజకీయం. ఇది కేవలం సంఘటనల పాట కాదు, దేశ సమగ్రతపై చేయబడే దాడి.ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌లో రాణాప్రతాప్ జయంతి సందర్భంగా అల్లర్లు, ఆంధ్రప్రదేశ్‌లో టిప్పు సుల్తాన్ జయంతి పేరుతో పార్టీల పోటీ పడుతున్నాయి. కశ్మీర్, మణిపూర్‌లలో అల్లర్లు పెద్ద ప్రాధాన్యత పొందకపోవడం వల్ల, రాజకీయ నేతలు ఇప్పుడు ఉత్తర, దక్షిణ భారతదేశంలోని ప్రాంతాలపై దృష్టి సారించారు. ఉద్రిక్తతలను పెంచేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు, మరియు ఒక వర్గం ఈ ప్రయత్నాలకు మద్దతు ఇస్తోంది. హాపూర్‌లో ధౌలానా ఏరియాలో రాణాప్రతాప్ జయంతి ర్యాలీని భగ్నం చేయడానికి ప్రయత్నం జరిగింది. అక్బర్ సైనికాధికారితో యుద్ధం చేసిన రాణాప్రతాప్ జయంతిని కొందరు వ్యతిరేకించారు. యోగి ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవడం గమనించదగినది ? రాళ్లు రువ్వినవారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో చిత్రం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. వైసీపీ, టీడీపీ టిప్పు సుల్తాన్ జయంతి విషయమై పోటీ పడుతున్నాయి. ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే టిప్పు సుల్తాన్ సర్కిల్ ఏర్పాటు చేశాడు, కడపలో గత వైసీపీ మేయర్ టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటుకు తీర్మానం చేశారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో విగ్రహం ఏర్పాటు చేయిస్తానని వాగ్దానం చేశారు.అల్మాస్‌గూడ ఏరియాకు టిప్పు సర్కిల్ అని పేరుపెట్టడానికి ప్రయత్నించినప్పుడు, హిందువులు దానిని హనుమాన్ సర్కిల్‌గా మార్చారు. దీంతో ముస్లింలు రోడ్లపైకి వచ్చి దాడి చేశారు, పోలీసులు గాయపడ్డారు, లాఠీచార్జి జరిగింది. జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది, శాంతి కమిటీ మీటింగ్‌లో గొడవ ఆపే ప్రయత్నం చేశారు, కానీ సమస్య పరిష్కరించలేదు.గుంటూరులో మహ్మద్ జిన్నా టవర్ విషంలో గొడవ జరిగింది. హిందువులు ఆగ్రహించడంతో టవర్‌కు జాతీయ జెండా రంగులు వేశారు. జాతీయ జెండా ఎగురవేయడం మొదలైంది. హిందువులు తలుచుకుంటే ఇలా మార్పు వస్తుంది. ఇది కేవలం మాట కాదు, నిజం. కానీ ప్రశ్న ఎక్కువ ముఖ్యమైనది: హిందువుల్లో పెరుగుతున్న అసంతృప్తి, కోపాన్ని రాజకీయ నేతలు గుర్తించకపోతే ఇబ్బందులు తప్పవు.టీడీపీ, వైసీపీ బెంగాల్ అస్సాంల నుంచి గుణపాఠం నేర్చుకోవాలి. ఈ రాష్ట్రాల్లో మత కల్లోలాల ఫలితాలు ఏమిటో చరిత్ర చెబుతోంది. మత రాజకీయాల్లో లాభం లేదు, కేవలం దేశ విభజనే ఉంది.మత కల్లోలాల వెనుక ఉన్నది కేవలం ముస్లిం ఓట్ల కోసం రాజకీయం మాత్రమే. ఇది నైతికంగా తప్పు, దేశసమగ్రతకు హానికరం. హిందువుల అసంతప్తిని గుర్తించి, బాధ్యతాయుతమైన రాజకీయాలు చేయాలి. జాతీయత్వం ముఖ్యం, మతం కాదు.

# 15 నుంచి మోదీ విదేశీ పర్యటనలు

న్యూఢిల్లీ, మే 12, (న్యూస్ పల్స్) అంతర్జాతీయ వేదికపై భారత దౌత్య పటిమను చాటేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరు రోజుల పాటు ఐదు కీలక దేశాల్లో పర్యటించనున్నారు. మే 15వ తేదీన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో ప్రారంభమయ్యే ఈ పర్యటన నెదర్లాండ్స్, స్వీడన్, నార్వేల మీదుగా సాగి మే 20వ తేదీన ఇటలీతో ముగియనుంది. మరి ఈ ఐదు దేశాల పర్యటనలో భాగంగా మోదీ ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతున్నారు, మే 15వ తేదీన ప్రధాని మోదీ తొలుత యూఏఈ అధ్యక్షుడిని కలుస్తారు. ఇంధన సహకారం, వాణిజ్యం, 4.5 మిలియన్ల భారతీయ సమాజ సంక్షేమంపై చర్చించనున్నారు. భారత్‌కు 3వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్న యూఏఈతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యం.అక్కడి నుంచి మే 15వ తేదీన నెదర్లాండ్స్ వెళ్తారు. 17వ తేదీ వరకు అక్కడే పర్యటిస్తారు. రక్షణ, గ్రీన్ హైడ్రోజన్, సెమీకండక్టర్లు, ‘నీటి నిర్వహణ’పై వ్యూహాత్మక ఒప్పందాలను సమీక్షించనున్నారు. నెదర్లాండ్స్ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.మే 17వ తేదీ రోజు స్వీడన్ వెళ్తారు. 18 తేదీల్లో స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌లో ప్రధాని పర్యటిస్తారు. గ్రీన్ ట్రాన్సిషన్, ఏఐ, అంతరిక్షం, రక్షణ రంగాల్లో పెట్టుబడులే లక్ష్యంగా చర్చలు సాగతాయియి. అలాగే ఐరోపా పారిశ్రామిక వేత్తల రౌండ్ టేబుల్ సమావేశంలో ఈయూ కమిషన్ ప్రెసిడెంట్‌తో కలిసి ఆయన ప్రసంగించనున్నారు.

43 ఏళ్ల తర్వాత నార్వే పర్యటన..!
ఈ పర్యటనలో అత్యంత విశేషంగా నార్వే పర్యటన నిలవబోతోంది. 43 ఏళ్ల తర్వాత భారత ప్రధాని నార్వే వెళ్లడం ఇదే తొలిసారి. మే 18వ తేదీన ఆయన నార్వేకు చేరుకుని 19వ తేదీన నార్వే రాజుతో పాటు ప్రధానితో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అదే సమయంలో ఓస్లోలో జరిగే ‘3వ భారత్-నార్డిక్ సమ్మిట్’లో మోదీ పాల్గొంటారు. డెన్మార్క్, ఫిన్లాండ్, ఐస్లాండ్ ప్రధానులు కూడా ఈ సదస్సుకు రానున్నారు.పర్యటన చివరి రోజైన మే 20వ తేదీన ప్రధాని మోదీ ఇటలీ చేరుకుంటారు. ప్రధాని జార్జియా మెలోనితో కలిసి ‘జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ 2025-2029’ అమలుపై సమీక్ష నిర్వహిస్తారు. రక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఇటలీతో భారత్ సంబంధాలను ఈ పర్యటన మరింత పటిష్టం చేయనుంది. మొత్తానికి ఐరోపా దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో.. ఈ పర్యటన భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## నిడుబ్రోలు రైల్వే స్టేషన్ వద్ద కాల్పుల కలకలం



గుంటూరు నిడబ్రోలు రైల్వే స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున కాల్పుల కలకలం సృష్టించాయి. రైల్వే సిగ్నల్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేసేందుకు కొందరు దుండగులు ప్రయత్నించగా.., వారిని అడ్డుకునేందుకు వెళ్లిన జీఆర్పీ పోలీసులపై రాళ్ల దాడి జరిగింది. దీంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం గాలిలోకి 10 రౌండ్లు కాల్పులు జరిపారు. దుండగులు రైల్వే సిగ్నల్ వైర్లను కత్తిరించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు గుర్తించారు. కాల్పుల అనంతరం వారు చీకటిని ఆసరాగా చేసుకుని పరారయ్యారు. ఘటనాస్థలానికి చేరుకున్న అధికారులు ఆధారాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు

# పెరిగిన చికెన్, మటన్ ధరలు



కాకినాడ, మే 12,మటన్ తో పోలిస్తే నాన్ వెజ్ ప్రియులు ఎక్కువగా చికెన్ ను తింటారు. డిమాండ్ కూడా ఎక్కువగానే ఉంటుంది. ఎందుకంటే.. ధరలు అందుబాటులో ఉంటాయన్న కారణంతో సామాన్యులు ఎక్కువగా చికెన్ ను కొనుగోలు చేసి తింటారు. అయితే.. ప్రస్తుత కాలంలో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఎండలు.. పెళ్లిళ్ల సీజన్.. సరఫరా తగ్గుదల.. వెరసి చికెన్ ధరలు భారీగా పెరిగాయి. రోజురోజుకూ చికెన్, మటన్ ధరలు పెరుగుతుండటంతో సామాన్యులు కొనాలా వద్దా అన్న పరిస్థితి నెలకొంది. వారం రోజుల నుంచి పరిశీలిస్తే చికెన్ (కోడి మాంసం) ధరలు అమాంతం 80 రూపాయల వరకు పెరిగింది. గతవారం కేజీ చికెన్ రూ.260 వరకు ఉండగా.. ప్రస్తుతం కిలో చికెన్ ధర రూ.360 పలుకుతోంది.

తాజా చికెన్ రేట్ల ప్రకారం.. ఫామ్ రేట్ లైవ్ బర్డ్ (కోడి కిలో) 170 నుంచి 180 ఉంది. డ్రెస్సెడ్ చికెన్ రూ.320 -330 వరకు అమ్ముతున్నారు. స్కిన్ లెస్ రూ.350 నుంచి రూ.360 వరకు విక్రయిస్తున్నారు. గుడ్లు డజన్ రూ.72 నుంచి 75 వరకు విక్రయిస్తున్నారు. చికెన్ రేట్లు భారీగా పెరగడంతో మాంసం ప్రియులు కోడి మాంసం కొనాలంటే జంకుతున్నారు. ప్రస్తుతం ధరలు మరింత పెరగడంతోపాటు జూన్ నెలాఖరు వరకు ఇలానే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు.వేసవి తీవ్రత కారణంగా కోళ్ల మరణాలు పెరగడం, ఫారాల్లో ఉత్పత్తి తగ్గడం వల్ల మార్కెట్‌లో సరఫరా తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు పెళ్లిళ్లు, ఫంక్షన్లు, హోటళ్ల నుంచి డిమాండ్ పెరగడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయని చెబుతున్నారు.

మటన్ రేట్లు..
ఇదిలా ఉంటే.. మటన్ రేట్లు సైతం భారీగా పెరిగాయి.. మార్కెట్లలో కేజీ మటన్ 1100లకి పెరగగా.. బోన్ లెస్ మటన్ రూ.1300 ల వరకు చేరింది.
అయితే.. మార్కెట్‌లలో మటన్, చికెన్ రేట్లు ప్రాంతానికోలా మారుతున్నప్పటికీ.. రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నారు.

# బాలుడిపై కుక్కల దాడి..తీవ్ర గాయాలు

హైదరాబాద్ -మీర్ పేట్ టీచర్స్ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. వీధి బయట ఆడుకుంటున్న



బాలుడిపై ఒక్కసారిగా 10 కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు అయ్యాయి పరిస్థితి విషమంగా ఉంది. సమ్మర్ హాలిడేస్ కోసం సిద్దిపేట నుండి తన పిన్ని ఇంటికి వచ్చిన అద్విక్ అనే చిన్నారిపై సుమారు 10 కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి.రాత్రి 7:30 నుండి 8:00 గంటల మధ్య ఇంటి సెల్లార్ ప్రాంతంలో చిన్నారి అద్విక్ ఇంటి సెల్లార్లో ఆడుకుంటున్న సమయంలో ఈ దారుణం జరిగింది.గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాబును చికిత్స నిమిత్తం కామినేని ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో బాబుకు అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో, అత్యవసరంగా నారాయణగూడ నుండి మందులను తెప్పించారు. ప్రస్తుతం బాబు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ఇంకా స్పష్టత ఇవ్వలేదు.వేసవి సెలవుల్లో సరదాగా గడుపుదామని వచ్చిన చిన్నారి ఇలా కుక్కల దాడికి గురవ్వడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

# నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాల అక్రమ రవాణా భగ్నం

### షామీర్‌పేట్‌లో 100 కిలోల విత్తనాల స్వాధీనం.. ఒకరు అరెస్ట్



మేడ్చల్ జిల్లా..శామీర్ పేట... నిషేధిత బీటీ-3 (బీజీ-ఎఎఎ హెచ్‌పీ వెరైటీ) పత్తి విత్తనాల అక్రమ రవాణా, విక్రయ యత్నాన్ని ఎస్‌వోటీ కంటోన్మెంట్ బృందం భగ్నం చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి షామీర్‌పేట్ పోలీసుల సహకారంతో శనివారం సాయంత్రం ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.7 సమీపంలో తనిఖీలు నిర్వహించగా, నిషేధిత విత్తనాలను విక్రయించేందుకు తీసుకెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా చెబ్రోలు గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు (58) వద్ద రెండు సంచుల్లో మొత్తం 100 కిలోల బీటీ-3 పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. ఒక్కో సంచిలో 50 కిలోల చొప్పున విత్తనాలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.విచారణలో భాగంగా నిందితుడు, తన సహచరుడు దాసరి సూరిబాబుతో కలిసి అన్నమయ్య జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు వద్ద తక్కువ ధరకే విత్తనాలు కొనుగోలు చేసి, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రైతులు, ఎరువుల దుకాణాలకు అధిక ధరలకు విక్రయించాలని యత్నించినట్లు వెల్లడించినట్టు పోలీసులు తెలిపారు.


# కేరళంలో కొనసాగుతున్న గందరగోళం

తిరువనంతపురం, మే 12, ఇటీవల ఎన్నికలు జరిగిన పశ్చిమ్ బెంగాల్, తమిళనాడు, కేరళలో ప్రభుత్వాలు మారగా. అసోం, పుదుచ్చేరిలో అధికారంలో ఉన్న పార్టీలు విజయం సాధించాయి. అయితే, పదేళ్ల తర్వాత కేరళలో కాంగ్రెస్ కూటమి మళ్లీ అధికారంలోకి వచ్చింది. కానీ, అక్కడ సీఎం అభ్యర్థి ఎవరు? అనేది మాత్రం ఎటూ తేల్చుకోలేని పరిస్థితి నెలకుంది. సీఎం పదవి కోసం ముగ్గురు నాయకులు పోటీ పడుతున్నారు. వీరిలో ఎవరివైపు కాంగ్రెస్ హైకమాండ్ మొగ్గుచూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.కేరళం ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ కూటమి ఘన విజయం సాధించినా.. ముఖ్యమంత్రి ఎంపిక విషయంలో హస్తం పార్టీ మల్లగుల్లాలు పడుతోంది. కేరళంతో పాటు ఎన్నికలు జరిగిన పశ్చిమ్ బెంగాల్, తమిళనాడులో ప్రభుత్వాలు కొలువుదీరగా.. అసోం, పుదుచ్చేరిలో ప్రస్తుతం సీఎంలే కొనసాగనున్నారు. కానీ, కేరళం విషయంలో కాంగ్రెస్ తమ సీఎం ఎవరు? అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సీఎం పదవి రేసులో వీడీ సతీషన్ , కేసీ వేణుగోపాల్, రమేష్ చెన్నితాల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అయితే, సీఎం పదవి ఆశిస్తున్న సతీషన్.. తాను మరో పదవిని స్వీకరించడానికి సిద్ధంగా లేనని స్పష్టంగా చెప్పినట్టు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. అంతేకాదు, అధిష్ఠానం మనసులోనూ ఆయనకు సీఎం పదవి ఇవ్వాలనే ఆలోచన లేన్నట్టు తెలుస్తోంది.వారంగా కొనసాగుతున్న ఈ ప్రతిష్టంభన 2023 నాటి కర్ణాటక పంచాయతీని గుర్తుకుతెస్తోంది. ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ల మధ్య అప్పట్లో యుద్ధమే నడిచింది. రాహుల్ గాంధీతో పాటు కేసీ వేణుగోపాల్ నేతృత్వంలోని ఏర్పడే ప్రభుత్వంలో సతీసన్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలనే కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం భావిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అలాగే, రమేష్ చెన్నితాలను శాసనసభ స్పీకర్‌గా నియమించే అవకాశం ఉంది.అయితే, ప్రజలతో పాటు యూడీఎఫ్ భాగస్వామ్య పక్షమైన ఐయూఎంఎల్ మద్దతు ఉన్న సతీషన్ ఆ పాత్రను అంగీకరించడానికి సిద్ధంగా లేరు. ఇది కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేసింది. శాసనసభ పక్షంలోని మెజారిటీ అభిప్రాయాన్ని తోసిపుచ్చడం, అలాగే మిత్రపక్షాల అభిప్రాయాలను విస్మరించడం కూడా తేలిక కాదు. ఈ ప్రతిష్టంభనకు పరిష్కారం కోసం కేరళ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లతో రాహుల్ గాంధీ మంగళవారం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారని వర్గాలు తెలిపాయి. సతీషన్, చెన్నితాల వైఖరిపై పార్టీ హైకమాండ్ ఇప్పటికే అసంతృప్తిగా ఉందని వర్గాలు పేర్కొన్నాయి.కర్ణాటకలో నాయకత్వ మార్పుపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో సతీసన్ అసంతృప్తి వల్ల జరిగే నష్టం గురించి పార్టీ నాయకత్వానికి బాగా తెలుసు. అంతేకాకుండా, వేణుగోపాల్‌ను సీఎంగా నియమిస్తే ఆయన ఎంపీ పదవికి రాజీనామా చేసి, ఉప ఎన్నికలో పోటీ చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో లోక్‌సభ స్థానానికి కూడా ఉప ఎన్నిక వస్తుంది. కాబట్టి ఇది కాంగ్రెస్‌కు తలనొప్పిని మరింత పెంచుతుంది.కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ.. ఈ నిర్ణయం చాలా ముఖ్యమైందని, అన్ని అంశాలపై చర్చించడానికి సమయం పడుతుందని అన్నారు. జాప్యం వల్ల ఎలాంటి నష్టం జరగదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళ అసెంబ్లీకి మే 23తో గడువు ముగియనుందని, ఈలోగా పరిష్కార మార్గాన్ని కనుగొంటామని చెప్పారు.

# నేపాలి కల్పన మామూలు లేడీ కాదు..

హైదరాబాద్, మే 12, తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ ప్రాంతంలో ప్రశాసన్ నగర్ అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. ఇంతటి భద్రత ఉండే ప్రాంతంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ (60) ఇటీవల ప్రాణాలు కోల్పోయారు. ఆమెను దారుణంగా అంతం చేశారు. ఈ ఘటనలో నిందితుల కోసం పోలీసులు విపరీతంగా శ్రమిస్తున్నారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దాన్ని పోలీసులు ఇప్పటికే ఒక అంచనాకొచ్చారు. ఆమె అత్యంత కఠినమైన పరిస్థితుల్లో ప్రాణం కోల్పోయారని పోలీసులు పేర్కొన్నారు. పోస్ట్ మార్టం నివేదికలో కూడా ఇదే తేలింది.ప్రశాసన్ నగర్ లో భద్రత చాలా కట్టు దిట్టంగా ఉంటుంది. పోలీసులు కూడా నిత్యం గస్తీ కాస్తూనే ఉంటారు. అయినప్పటికీ ఈ ఘటన ఎందుకు జరిగిందనేది అర్థం కావడం లేదు. ఈ ఘటన జరిగిన తర్వాత పోలీసులు దాదాపు 200కు పైగా సిసి టీవీల కేమెరాల ఫుటేజీ పరిశీలించారు. అంతేకాదు కొంతమంది పోలీసులు శుక్రవారం సాయంత్రం నేపాల్ వెళ్లినట్టు తెలుస్తోంది.ఈ ఘటనలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్పన, మరో ఇద్దరు జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆటోలో ఎక్కారని.. వారు నాంపల్లి ప్రాంతంలో దిగినట్టు ఆధారాలు లభించాయి.. వారు నాగ్ పూర్ ప్రాంతానికి వెళ్లి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ ప్రాంతానికి వెళ్లడానికి వారు తెలంగాణ ఎక్స్ ప్రెస్ ఎక్కినట్టు తెలుస్తోంది. వి నేపథ్యంలో పోలీసులు ముందుగానే అక్కడికి వెళ్లారు. రైలు భోగిలలో విస్తృతంగా తనిఖీలు చేశారు. అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. పోలీసులను తప్పు దోవ పట్టించేందుకు ఈ ఘటనకు పాల్పడిన వారు మధ్యలోనే దిగి ఉంటారని తెలుస్తోంది.కల్పన నేపాల్ దేశానికి చెందిన యువతి. ఈమెకు డబ్బు పిచ్చి చాలా ఎక్కువ. పైగా విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంట్లో డబ్బు బాగా ఉంటుందని ఒక అంచనాకొచ్చింది. పైగా ఈమె వెనుక ఒక ముఠా కూడా ఉంది. కొద్దిరోజుల క్రితం విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ ఇంట్లో పని మనుషులు కావాలని తెలిసింది. దీంతో ఆ ముఠా మనుషులు రంగంలోకి దిగారు. విశ్రాంత ఐపీఎస్ అధికారితో మాట్లాడారు. కల్పన మీ ఇంట్లో పని చేసేందుకు వస్తుందని చెప్పారు. దానికి ఆయన ఒప్పుకున్నారు. అప్పటినుంచి కల్పన వినయ్ ఇంట్లో పని చేస్తోంది. వినయ్ ఈమెను ఇంట్లో మనిషి లాగా నమ్మారు. పైగా ఆయన భార్యకు ఆరోగ్యం అంతంత మాత్రమే. పిల్లలు వేరే ప్రాంతాలలో స్థిరపడ్డారు.. ఇటీవల వినయ్ ఆరోగ్యం సరిగా లేకపోతే బెంగళూరు వెళ్లారు. దానికంటే ముందు కల్పన ఇంట్లో మనిషిలాగా మెదిలిపోయింది. వినయ్ డబ్బులు పెట్టేది.. బంగారం దాచేది చూసింది. వినయ్ బెంగళూరు వెళ్ళిపోగానే ఆ ముఠా సభ్యులు ప్రణాళికను కల్పన చెప్పారు. కల్పన వారు చెప్పినట్టుగానే రంగంలోకి దిగింది. కొంతమంది వ్యక్తులతో కలిసి వినయ్ భార్యను అంతం చేసింది. ఇంతటి దారుణానికి పాల్పడేందుకు ప్రధాన కారణం డబ్బు, బంగారమే.. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు చాలా వరకు ఆధారాలు సేకరించారు. త్వరలోనే కల్పన, ఆమె వెనుక ఉన్న ముఠా సభ్యులను పట్టుకుంటామని చెబుతున్నారు.కల్పనతో అత్యంత చనువుగా ఉన్న మహిళలను పోలీసులు విచారించారు.. వినయ్ కి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చికిత్స కోసం బెంగళూరు వెళ్లారు. ఆయన వెళ్లిన తర్వాత కల్పన ఈ దారుణానికి పాల్పడింది. దానికంటే ముందు ఫోన్లో ఎక్కువసేపు మాట్లాడింది. సిసి కెమెరాలు మొత్తం రికార్డు అయ్యాయి. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో పోలీసులకు ఒక ఫోన్ లభించింది. అందులో ఉన్న నంబర్ల ఆధారంగా పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. ఈ దారుణానికి పాల్పడింది ముగ్గురా లేదా నలుగురా అనేది తెలసి ఉంది. కల్పన మామూలు లేడీ కాదని.. ముందుగానే ఒక పథకం ప్రకారం ఇంట్లో పనిమనిషిగా చేరిందని.. ఆ తర్వాత మొత్తం దోచుకుని పోయిందని పోలీసులు చెబుతున్నారు. అయితే ఆమెకు ఈ ఆదేశాలు మొత్తం బయట నుంచి వచ్చాయని.. ఆమె వెనుక ఉన్న ఆ వ్యక్తులు ఎవరో త్వరలోనే బయట పెడతామని తెలంగాణ పోలీసులు చెబుతున్నారు.

# బండి విషయంలో సీఎం ఎంట్రీ...





కరీంనగర్, మే 12, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఒక మైనర్ బాలిక పట్ల అసభ్య ప్రవర్తనకు పాల్పడ్డారన్న ఆరోపణలు, దానిపై నమోదైన కేసులు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ ఉదంతాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బాధితులకు న్యాయం చేయడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు.ఈ కేసు నమోదులో జరిగిన జాప్యంపై సీఎం రేవంత్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. దీనిపై డీజీపీ సీవీ ఆనంద్‌ను స్వయంగా పిలిపించి వివరణ కోరారు. ఈ నెల 8నే బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ, నిందితులపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరగడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం భద్రతా ఏర్పాట్లలై నిమగ్నమైందని, అందుకే జాప్యం జరిగిందని డీజీపీ సీవీ ఆనంద్ వివరణ ఇచ్చారు.కేసు పూర్వాపరాలను నిశితంగా పరిశీలించిన ముఖ్యమంత్రి, తక్షణమే సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపాలని, ఎక్కడా సాక్ష్యాలు తారుమారు కాకుండా పారదర్శకమైన నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు. “న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని” అధికారులను హెచ్చరించారు.తన 17 ఏళ్ల కుమార్తెను భగీరథ్ వేధిస్తున్నాడంటూ ఓ తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పేట్‌బషీరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలు మైనర్ కావడంతో నిందితుడిపై కఠినమైన సెక్షన్లను ప్రయోగించారు. బాలికపై లైంగిక వేధింపులు, అనుచిత ప్రవర్తన వంటి అంశాల ఆధారంగా ఈ అభియోగాలు మోపారు.కేసు విచారణ సాగుతుండగానే ఈ ఉదంతం మరో మలుపు తిరిగింది. సదరు బాలిక తల్లిదండ్రులు తనను డబ్బుల కోసం బెదిరిస్తున్నారంటూ భగీరథ్ కరీంనగర్ పోలీసులను ఆశ్రయించారు. తన ప్రతిష్ఠను భంగం కలిగించేలా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కరీంనగర్ టూటౌన్ పోలీసులు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. దీంతో ఈ కేసు ఇరుపక్షాల ఫిర్యాదులతో క్లిష్టంగా మారింది.రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించినట్లు తెలుస్తోంది. కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్ రెడ్డి ఇప్పటికే సైబరాబాద్ సీపీ నుంచి పూర్తి స్థాయి నివేదికను తెప్పించుకున్నారు. దీనిపై లోతైన విచారణ జరిపేందుకు కమిషన్ ఒక ప్రత్యేక బెంచ్ ను ఏర్పాటు చేసింది. బాలిక భద్రత, మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని కమిషన్ విచారణను వేగవంతం చేయనుందిముఖ్యమంత్రి నేరుగా జోక్యం చేసుకోవడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రాబోయే 24 గంటల్లో ప్రత్యేక బృందాలు బాధితులు, సాక్షుల నుంచి వాంగ్మూలాలను సేకరించనున్నాయి. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ కేసులో తదుపరి అరెస్టులు లేదా ఇతర చర్యలు ఉండవచ్చు. రాజకీయంగా కూడా ఈ అంశం కాక రేపుతోంది. విచారణ పారదర్శకంగా జరగాలని అధికార పక్షం అంటుంటే, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తమ కుమారుడిని ఇరికించారని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి. ఏది ఏమైనా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, శాంతిభద్రతల విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# మోడీ గ్రేటర్ వ్యూహం...



హైదరాబాద్, మే 12, తెలంగాణలో పర్యటించారు ప్రధాని నరేంద్ర మోడీ. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దాదాపు పదివేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభ జరిగింది. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డితో సైతం సన్నిహితంగా మెలిగారు ప్రధాని. ఒక విధంగా చెప్పాలంటే పక్క పొలిటికల్ వ్యూహంతోనే సాగింది నరేంద్ర మోడీ పర్యటన. అయితే మరోవైపు హైదరాబాదులో ఉంటున్న ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులతో గడిపారు మోడీ. అయితే దీని వెనుక గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల వ్యూహం ఉన్నట్టు అర్థం అవుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనలను గమనిస్తే ఒక వ్యూహం ప్రకారమే సాగుతుంటాయి. ఇప్పుడు చంద్రబాబుతో పాటు పవన్ విషయంలో కూడా ప్రధాని ఆలోచన అదేనని ఒక టాక్ నడుస్తోందిమరి కొద్ది రోజుల్లో గ్రేటర్ ఎన్నికలు జరగనున్నాయి. భారతీయ జనతా పార్టీ వీటిని ఒక సెమీఫైనల్స్ గా భావిస్తున్నాయి. అందుకే ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత ఎన్నికల్లో సైతం ఇక్కడ మంచి ఫలితాలు సాధించింది.. అందుకే ఈసారి మేయర్ పీఠం సాధించడం ద్వారా తెలంగాణలో తామే ప్రత్యామ్నాయం అన్నట్టు సంకేతాలు పంపాలని చూస్తోంది. ఈ క్రమంలోనే ప్రధాని మోడీ స్వయంగా రంగంలోకి దిగారు. చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ ఇళ్లకు వెళ్లి.. టిడిపి తో పాటు జనసేన మద్దతును పరోక్షంగా పొందినట్టు అర్థం అవుతోంది.గ్రేటర్ పరిధిలో టిడిపికి క్యాడర్ ఉంది. ఒక బలమైన సామాజిక వర్గం దన్ను ఉంది. ఆ రెండింటిని తిప్పుకుంటే బీజేపీకి ఇక్కడ ప్లస్ పాయింట్ అవుతుంది. పైగా పవన్ కళ్యాణ్ ఇమేజ్ కూడా గ్రేటర్ పరిధిలో ఎక్కువ. ఏపీలో ప్రధాన భాగస్వామ్య పక్షాలుగా ఉండడంతో సెటిలర్స్ తప్పకుండా బిజెపి వైపు మొగ్గ చూపుతారని అంచనాలు ఉన్నాయి. అయితే ఆ ఇద్దరు నేతలను కలవడం ద్వారా సరికొత్త సంకేతాలను పంపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి పోటీకి దూరంగా ఉండిపోయింది. అది అంతిమంగా కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చిందని విశ్లేషణలు ఉన్నాయి. ఒకవేళ గ్రేటర్ ఎన్నికల పరిధిలో టిడిపి ఓటు బ్యాంకును బిజెపి వైపు మళ్లించగలిగితే.. భారతీయ జనతా పార్టీ గెలుపు నల్లేరు మీద నడక కానుంది. ఆ ఉద్దేశంతోనే చంద్రబాబు ఇంటికి వెళ్లిన మోడీ గంటా పది నిమిషాల పాటు ఆయన కుటుంబ సభ్యులతో గడిపారు.పవన్ కళ్యాణ్ బిజెపికి సానుకూలంగా ఉంటారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లోనే బీజేపీతో కలిసి పోటీ చేశారు కొన్నిచోట్ల. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకున్నారు. తెలంగాణ కంటే గ్రేటర్ పరిధిలో పవన్ కళ్యాణ్ అభిమానులు ఎక్కువ. అందుకే వారిని మచ్చిక చేసుకోవడానికి ప్రధాని నరేంద్ర మోడీ పరామర్శ పేరుతో పవన్ ఇంటికి వెళ్లారు అనేది పొలిటికల్ వర్గాల్లో వినిపిస్తున్న మాట. మొత్తానికి అయితే ప్రధాని టూర్ వెనుక గట్టి వ్యూహమే ఉన్నట్టు స్పష్టమైంది.

# 47 డిగ్రీలకు చేరిన టెంపరేచర్



అదిలాబాద్, మే 12, తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. మే 14వ తేదీ నుంచి మే 21వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన వడగాల్పులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. గడిచిన కొద్ది రోజులుగా కురిసిన అకాల వర్షాల వల్ల కాస్త ఉపశమనం లభించినప్పటికీ.. ఇకపై భానుడి భగభగలు రెట్టింపు కానున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ వెల్లడించారు. ప్రధానంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరనుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల సెల్సియస్ దాటే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కుమురం భీమ్ ఆసిఫాబాద్ వంటి జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలలను రెడ్ మార్క్ జిల్లాల జాబితాలో చేర్చారు. ఈ ప్రాంతాల్లో మే 14 నుండి వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుందన్నారు. గాలిలో తేమ శాతం తగ్గి, పొడి గాలులు వీయటం వల్ల వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇక భాగ్యనగర ప్రజలకు కూడా ఊరట లేదు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెల్సియస్ నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకపోవడమే శ్రేయస్కరమని సూచిస్తు?న్నారు.తీవ్రమైన ఎండల దృష్ట్యా ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంటున్నారు. దాహం వేయకపోయినా ప్రతి గంటకు నీరు తాగుతూ ఉండాలని.. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్, నిమ్మరసం వంటి పానీయాలు శరీరంలో ఎలక్ట్రోలైట్ స్థాయిని కాపాడుతాయని సూచిస్తున్నారు. మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని, కెఫీన్ ఉండే కాఫీ, టీ, ఆల్కహాల్‌ను దూరంగా ఉండాలంటున్నారు. లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని.. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా కళ్లద్దాలను వాడటం మర్చిపోవద్దని చెబుతున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళ ప్రయాణాలు చేయవద్దని.. ఒకవేళ బయట ఉన్నప్పుడు తల తిరగడం, వాంతులు లేదా నీరసం అనిపిస్తే వెంటనే నీడకు చేరుకోవాలని సూచిస్తున్నారు.కాగా, తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఆయా జిల్లాల్లో హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తోంది. మధ్యాహ్నం వేళ ఉపాధి హామీ పనులు నిర్వహించకూడదని, ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద నీడ సౌకర్యం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ఈ వారం రోజుల పాటు జాగ్రత్తగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు

# మోదీ ‘ఓపెన్ ఆఫర్ లెక్కంటీ...

హైదరాబాద్, మే 12, తెలంగాణ గడ్డపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఒక ప్రకటన ఇప్పుడు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏది కోరితే అది చేయడానికి సిద్ధం.. ఆయన అడిగిన అంశాలన్నింటికీ నా ఆమోదం ఉంది.. ఆయన నాతో కలిస్తే మరింత బాగుంటుంది.. అంటూ మోదీ ‘ఓపెన్ ఆఫర్‘ ఇచ్చారు. దీనిపైన సీఎం రేవంత్ రెడ్డి  సమాధానం ఇచ్చారు.సాధారణంగా ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులపై విమర్శలు గుప్పించే మోదీ, రేవంత్ రెడ్డి విషయంలో సానుకూలంగా స్పందించడం వెనుక పెద్ద రాజకీయ సమీకరణమే కనిపిస్తోంది. ఇది కేవలం అభివృద్ధికి ఇచ్చిన హామీ మాత్రమే కాదు, రాష్ట్రంలో కాంగ్రెస్ ? బీజేపీల మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, ప్రధాన ప్రత్యర్థి అయిన బీఆర్ఎస్‌ను మరింతగా దెబ్బతీయాలన్నది బీజేపీ ఎత్తుగడగా విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లతో మోదీ భేటీ అయిన తరుణంలోనే, రేవంత్ రెడ్డికి ఈ తరహా ఆఫర్ ఇవ్వడం ద్వారా తెలంగాణలో కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లో పడేసే ప్రయత్నం చేశారా అన్న చర్చ మొదలైంది.అయితే.., ప్రధాని వేసిన ఈ రాజకీయ పాచికను రేవంత్ రెడ్డి అంతే చాకచక్యంగా ఎదుర్కొన్నారు. మోదీ ఇచ్చిన ఆఫర్‌ను ఆయన కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోణంలోకి మళ్లించారు. “మోదీ మాటలను ఎవరికి వారు అర్థం చేసుకుంటున్నారు. కానీ ప్రధాని రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తానని అన్నారు.. నన్ను కాదు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించడం రాజ్యాంగబద్ధమైన హక్కు.. దాన్ని సాధించుకుంటాం.” అని రేవంత్ రెడ్డి వివరణ ఇచ్చారు.ఈ ఒక్క మాటతో మోదీ ఇచ్చిన ఆఫర్‌ను రేవంత్ రెడ్డి రాజకీయ లబ్ధిగా కాకుండా, రాష్ట్ర హక్కుగా మార్చేశారు. కేసీఆర్ కాలంలో తమకు నిధులు వద్దు.. మీ ప్రేమ చాలు అని మోడీతో అన్నారని, కానీ తమని అభివృద్ధి హక్కు అని రేవంత్ స్పష్టంచేశారు. ఈ తేడాను ప్రజలు గమనించాలని కోరారు. రేవంత్ రెడ్డి కేవలం మాటలకే పరిమితం కాలేదు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలన్న తన విజన్‌కు మోదీ ఆమోదం తెలిపారని చెప్తూనే, వాస్తవ గణాంకాలను ఎండగట్టారు.ఆర్ఆర్ఆర్, మెగా టెక్స్‌టైల్స్, డిఫెన్స్ ల్యాండ్స్ వంటి పెండింగ్ అంశాలను క్లియర్ చేయించడం తన విజయమని చాటారు. కేంద్రం నుంచి ఆశించిన మేర సహకారం లేదు అని రేవంత్ కుండబద్దలు కొట్టారు. రీజనల్ రింగ్ రోడ్డు సదరన్ పార్ట్, మెట్రో వంటి కీలక అంశాల్లో కేంద్రం ఇంకా మొండిచేయి చూపుతోందని, వాటిని సాధించుకునేందుకు ‘సింగిల్ విండో’ కావాలని ప్రధాని ముందే డిమాండ్ ఉంచారు.రాజకీయంగా మోదీని ఢీకొనే విషయంలో రేవంత్ రెడ్డి మరింత కటువుగా వ్యవహరించారు. బీజేపీని “బ్రిటిష్ జనతా పార్టీ”గా అభివర్ణిస్తూ.. విభజించు-పాలించు సిద్ధాంతంపై దాడి చేశారు. ముస్లింలను, మావోయిస్టులను వేరుగా చూడటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 818 మంది మావోయిస్టులను లొంగిపోయేలా చేయడం తెలంగాణ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని రేవంత్ స్పష్టం చేశారు. “బుల్లెట్ కాదు బ్యాలెట్” అని తాము నిరూపించామని సవాల్ విసిరారు.ప్రధాని మోదీ ‘ఓపెన్ ఆఫర్’ ద్వారా ఒక స్నేహపూర్వక వాతావరణం సృష్టించి రేవంత్‌ను రాజకీయంగా ఇరుకున పెట్టాలని చూస్తే.. రేవంత్ రెడ్డి ఆ ఆఫర్‌ను ‘రాష్ట్ర అభివృద్ధికి కనీస బాధ్యత’గా మార్చేసి, బీజేపీ విభజన రాజకీయాలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే, తెలంగాణలో ఇకపై అభివృద్ధి విషయంలో సామరస్యం.. రాజకీయాల్లో సంఘర్షణ మరింత తీవ్రం కానున్నాయని అర్థమవుతోంది.

# హైదరాబాద్ లో మహిళల సేఫ్టీ ఎక్కడ...

హైదరాబాద్, మే 12, హైదరాబాద్ నగరంలో అర్ధరాత్రి మహిళల భద్రత ఎలా ఉందో తెలుసుకోవాలని భావించిన మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతికి చేదు అనుభవం ఎదురైంది. స్వయంగా ఆమె సాధారణ దుస్తుల్లో రోడ్డుపైకి వెళ్లగా, పలువురు వ్యక్తులు ఆమెను వేధించే ప్రయత్నం చేశారు. ఒక ఐపీఎస్ అధికారిణికే ఇలాంటి పరిస్థితి ఎదురైతే సామాన్య మహిళల పరిస్థితి ఏంటన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ సాహసోపేతమైన ఆపరేషన్ మరియు అందులో తేలిన నగ్న సత్యాల గురించి ఈ కథనం..కొత్తగా ఏర్పడిన మల్కాజిగిరి కమిషనరేట్ బాధ్యతలు చేపట్టిన బి. సుమతి , మే 2వ తేదీ అర్ధరాత్రి దిల్‌సుఖ్‌నగర్ వీధుల్లోకి వెళ్లారు. ఆమె వెంట గన్‌మెన్లు కానీ, యూనిఫాం పోలీసులు కానీ లేరు. ఒక సాధారణ మహిళలా బస్సు కోసం ఎదురుచూస్తున్నట్లుగా ఆమె బస్టాప్‌లో నిలబడ్డారు. నగరంలో మహిళలు అర్ధరాత్రి వేళ ఎంత ధైర్యంగా తిరగగలరో ప్రత్యక్షంగా చూడటమే ఆమె ఉద్దేశ్యం. నిమిషాల్లోనే మొదలైన వేధింపులు: ఆమె రోడ్డుపై నిలబడిన కొద్దిసేపటికే అసలు రంగు బయటపడింది. టీనేజర్ల నుండి మధ్యవయస్కుల వరకు చాలా మంది ఆమెను సమీపించి అసభ్యకరమైన కామెంట్స్ చేశారు. కొందరైతే ఏకంగా అసభ్యంగా ప్రవర్తించే ప్రయత్నం చేశారు. ఇక అక్కడ వాహనాలు తిరుగుతున్నా, ఆమె సాధారణ దుస్తుల్లో ఉండటంతో ఎవరూ గుర్తుపట్టలేదు. సుమారు మూడు గంటల పాటు ఆమె అదే ప్రాంతంలో ఉండి అక్కడి పరిస్థితులను గమనించారు చివరికి తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో ఒక కానిస్టేబుల్ ఆమెను గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, ఆమెను వేధించిన సుమారు 40 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇక వీరిలో ఎక్కువ మంది హాస్టళ్లలో ఉంటూ చదువుకునే విద్యార్థులు కావడం గమనార్హం. పట్టుబడిన వారిలో చాలా మంది మద్యం, గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కౌన్సెలింగ్‌తో బుద్ధి చెప్పిన వైనం:అదుపులోకి తీసుకున్న వారిని కేవలం జైలుకు పంపడమే కాకుండా, వారి తల్లిదండ్రుల సమక్షంలో కమిషనర్ సుమతి గారు స్వయంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఒక మహిళ ఒంటరిగా కనిపిస్తే గౌరవించాల్సింది పోయి, వేధించడం ఎంతటి నేరమో వారికి అర్థమయ్యేలా చెప్పారు. ఇక ఈ ఆపరేషన్ తర్వాత ఆ ప్రాంతంలో డ్రోన్లతో నిఘా పెంచడమే కాకుండా షీ టీమ్స్ గస్తీని మరింత ముమ్మరం చేశారు. సుమతి చేసిన ఈ ప్రయోగం మన సమాజంలోని లోపాలను ఎత్తిచూపింది. పోలీసులు ఎన్ని చట్టాలు తెచ్చినా, గస్తీ పెంచినా మనుషుల ఆలోచనా ధోరణి మారనంత వరకు మహిళలకు పూర్తి భద్రత లభించదు. ఇక ఒక పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌కే ఇలాంటి పరిస్థితి ఎదురైందంటే, సామాన్యులు ఎంత జాగ్రత్తగా ఉండాలో అర్థం చేసుకోవచ్చు.

# పోలవరం పై అభ్యంతరాలు...

కరీంనగర్, మే 12, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఫేజ్-2 పనులను పునః ప్రారంభించే ప్రయత్నాలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫేజ్--2 కింద 45.72 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ స్థాయిలో నీటి నిల్వ చేయడానికి ముందు, తెలంగాణలో కలిగే ముంపు, డ్రెయి నేజీ సమస్యలు, బ్యాక్‌వాటర్ ప్రభావంపై పూర్తి స్థాయి సంయుక్త సర్వే చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ ఇరిగేషన్ శాఖ ఇంజనీర్-ఇన్- చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ) సీఈఓకు లేఖ రాశారు.

ఇప్పటికే సుప్రీంకోర్టులో తెలంగాణ దాఖలు చేసి న ఒరిజినల్ సూట్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పి టిషన్ల నేపథ్యంలో కేంద్ర జల సంఘం చైర్మన్ ఆ ధ్వర్యంలో జరిగిన నాలుగు సాంకేతిక సమావేశా ల్లో సంయుక్త సర్వేకు అంగీకారం కుదిరిందన్నారు. భద్రాచలం పట్టణం, మణుగూరు హెవీ వాట ర్ ప్లాంట్, కిన్నెరసాని, ముర్రేడు వాగుల పరిసర ప్రాంతాల్లో ముంపు ప్రభావాలను అంచనా వే యాల్సి ఉంది.పోలవరం ప్రాజెక్ట్‌ను రెండు దశ ల్లో అమలు చేస్తున్నట్లు 2025 ఏప్రిల్ 8న జరిగి న ప్రత్యేక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ అధికారులు వెల్లడించిన విషయాన్ని గుర్తు చేసింది. మొ దటి దశలో 41.15 మీటర్ల వరకు, రెండోదశలో 4 5.72 మీటర్ల వరకు నిల్వ చేపడతామని అ ప్పట్లో తెలిపారని, రెండోదశ పనులు చేపట్టే ముందు రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని పే ర్కొంది. ఇదే సమయంలో పోలవరం లిఫ్ట్ స్కీ మ్ పనులను ఏపీ ప్రభుత్వం పునః ప్రారంభించేందుకు ఆదేశాలు ఇచ్చినట్లు మీడియాలో వస్తు న్న వార్తలపై తెలంగాణ సర్కార్ ఆందోళన వ్యక్తం చే సింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, సీడబ్ల్యూసీ, పీపీ ఏ అనుమతి లేకుండానే లిఫ్ట్ స్కీమ్ పనులు చేపడుతున్నారని తెలంగాణ సర్కార్ ఆరోపించింది.

ఇప్పటికే 2021--22లో ఈ పనులను నిలిపివేయాలని కేంద్ర సంస్థలు ఆదేశించాయని గుర్తు చేసింది. ముంపు ప్రాంతాలపై పూర్తి స్థాయి సర్వే పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా భద్రాచలం సహా ప్రభావిత ప్రాంతాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.36 వాగుల డ్రైనేజ్ ప్రభావంపై అధ్యయనం చేయాలని తెలంగాణ డిమాండ్ చేసింది. పోలవరం లిఫ్ట్ స్కీమ్ పునఃప్రారంభంపై తెలంగాణ ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఏపీ పనులు చేస్తోందని ఆరోపించింది. పోలవరం లిఫ్ట్ స్కీమ్ వెంటనే ఆపాలని తెలంగాణ కోరింది.

ఏపీ పనులను నియంత్రించాలని పీపీఏకి తెలంగాణ విజ్ఞప్తి చేసింది.పోలవరం ప్రాజెక్ట్ సమగ్ర సాంకేతిక, ఆర్థిక, అంతర్రాష్ట్ర అంశాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించారని, లిఫ్ట్ స్కీమ్ వంటి మా ర్పులు ఇతర అంశాలపై ప్రభావం చూపుతాయని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కూడా అప్పట్లో ఏపీ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు పేర్కొం దిపోలవరం లిఫ్ట్ స్కీమ్ పనులను వెంటనే నిలిపివేసి, ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలను కూడా సమీక్షించాలని పీపీఏను కోరింది.

ఈ అంశాన్ని కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ ఇరిగేషన్ శాఖ ప్రభుత్వాన్నికోరగా, గోదా వ రి నది నిర్వహణ బోర్డు(జీఆర్ఎంబీ) కూడా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# బ్రహ్మంగారి మఠం లో పలు చోట్ల వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు దొంగతనం...!



బ్రహ్మంగారిమఠం మండలంలో సోమిరెడ్డి పల్లె సచివాలయం 2,చౌదరి వారి పల్లె గ్రామంలో నిన్న రాత్రి ఐదు మంది రైతుల కేబుల్ వైర్లు చోరీ..ఒక్కో మోటర్ వద్ద 40 నుండి 50 మీటర్ల కేబుల్ వైరు ను కత్తిరించి తీసుకెళ్తున్న దొంగలు..మీటర్ 200 చొప్పున ధర పలుకుతుంది.. ఒక్కో రైతు మోటార్కు ఏడు నుండి ఎనిమిది వేల రూపాయల కేబుల్ కొనాల్సి వస్తుంది..కేబుల్ వైర్లు కట్ చేసుకుని వెళ్లడంతో మోటర్ ను ఎత్తి అనంతరం దించే ఖర్చులతో సతమతమవుతున్న రైతులు ..పోలీసులు కేబుల్ వైర్ల దొంగలపై నిఘా ఉంచి దొంగతనాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

# కాశినాయన మండలంలో దేవాలయాల అభివృద్ధికి దేవాదాయ మంత్రి ఆనం హామీ



బద్వేలు నియోజకవర్గం కాశినాయన మండలంలోని పలు గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని టీడీపీ నేతలు కోరారు. మంగళవారం బద్వేల్‌కు విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి తో కలిసి బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో కాశినాయన మండల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సానుకూలంగా స్పందించారు. కాశినాయన మండలంలోని ప్రతి గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాశినాయన మండల టీడీపీ నాయకులు పోలిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దుర్గమ్మను దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. వెంకట జ్యోతిర్మయి ప్రతాప్

విజయవాడ: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ సోమవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదల ప్రకారం, అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జస్టిస్ జ్యోతిర్మయి కి దుర్గగుడి ఈవో వీకే సీనా నాయక్, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు జస్టిస్ జ్యోతిర్మయి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు వేదాశీర్వచనం అందజేశారు.

# గంగమ్మ జాతరకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు. చిత్తూరు డీఎస్పీ జె. వెంకటనారాయణ.

చిత్తూరు పట్టణంలో ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించే గంగమ్మ జాతర సందర్భంగా భక్తులు కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకొని జాతరను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని చిత్తూరు డీఎస్పీ జె. వెంకటనారాయణ కోరారు. ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని ఆయన తెలిపారు.జాతరకు విచ్చేసే మహిళలు, చిన్నారులు, వృద్ధులు మరియు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విస్తృత స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేకంగా జాతర ప్రాంతాల్లో మరియు ఓం శక్తి ఊరేగింపులో మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, ఈవ్-టీజింగ్, వేధింపులు, మద్యం సేవించి అల్లర్లు సృష్టించడం, గొలుసు చోరీలు, జేబుదొంగతనాలు వంటి ఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.జాతర ప్రాంతాల్లో మఫ్టీ పోలీసులు, షీ టీమ్స్, ప్రత్యేక పికెట్స్, డ్రోన్ కెమెరాలు మరియు సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. ఈ కెమెరాలను గాంధీ కూడలి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి 24 గంటల పాటు ప్రత్యేక పోలీసు అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.మహిళలను వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, గొలుసు చోరీలు, జేబుదొంగతనాలు లేదా ఇతర నేరాలకు పాల్పడే వ్యక్తులను సంఘటన జరిగిన వెంటనే కాకపోయినా, సీసీ ఫుటేజ్ మరియు సాంకేతిక ఆధారాల ద్వారా గుర్తించి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జాతరకు వచ్చే భక్తులు తమ బంగారు ఆభరణాలు, నగదు మరియు విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. చిన్నారులను ఒంటరిగా వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించి ప్రశాంత వాతావరణంలో గంగమ్మ జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఎదురెదురుగా ఢీకొన్న లారీలు.. ఇద్దరు సజీవ దహనం

ఖమ్మం తిరుమలాయపాలెం (మండలం)లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం వైజాగ్ నుంచి మహారాష్ట్ర వెళ్తున్న బొగ్గు లారీ మర్రిపేడ నుంచి ఖమ్మం వైపు వెళుతున్న మరో లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. మేకల తండా స్టేజి సమీపంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో రెండు లారీలు నుజ్జునుజ్జు కాగా, ప్రమాద దాటికి బొగ్గులోడ్ లారీలో మంటలు చెలరేగాయి. దీంతో లారీ డ్రైవర్ జేమ్స్ తో పాటు మరో వ్యక్తి సజీవ దహనమయ్యారు. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

## నిలోఫర్ నర్సులను సత్కరించిన మంత్రి పొన్నం




హైదరాబాద్ నిలోఫర్ హాస్పిటల్ లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ , జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, డిఎంహెచ్ వో వెంకట్, నిలోఫర్ సూపరిండెంట్ డాక్టర్ విజయ్ కుమార్, ఆర్డీవో రామకృష్ణ, నర్సులు తదితరులు పాల్గొన్నారు. నర్సుల దినోత్సవం సందర్భంగా నిలోఫర్ హాస్పిటల్ నర్సులను సత్కరించారు.

## లాయర్ మెడలో నుంచి గోల్డ్ చైన్ లాక్కెళ్లిన దుండగులు

వరంగల్ నగరంలో వరుస చైన్ స్నాచింగ్ ఘటనలు కలకలం సృష్టిస్తున్నాయి. కాశీబుగ్గ సొసైటీ కాలనీలో ఇంటిముందు కూర్చొని ఫోన్ మాట్లాడుతున్న లాయర్ మెడలో నుంచి 2 తులాల బంగారు చైన్‌ను దుండగులు లాక్కెళ్లారు. స్నాచర్లను వెంబడించే క్రమంలో లాయర్ కిందపడి గాయాలపాలయ్యారు. రెండు చోట్ల చైన్ స్నాచింగ్‌కు పాల్పడింది ఒకే ముఠా అని పోలీసులు గుర్తించారు.. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వరంగల్లో మందు బాబుల వీరంగం

వరంగల్ ఒక టీ స్టాల్ లో మందుబాబులు వీరంగం సృష్టించారు. మిల్స్ కాలనీ పరిధిలోని గణపతి ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా ఉన్న ఓ టీ స్టాల్ వద్దకు ఏడుగురు యువకులు మద్యం మత్తులో వచ్చారు. వాటర్ బాటిల్ తీసుకుని కౌంటర్ మీద ఉమ్మడంతో, ఎందుకు ఉమ్మివేశారని టీ స్టాల్ యజమాని నిలదీసారు. దీంతో యజమానిపై, అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిపై సీసాలతో మందు బాబులు దాడి చేసారు. ఈ ప్రాంతంలో తరచూ పోకిరీల ఆగడాలు ఎక్కువ అవుతున్నా, పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికుల ఆరోపణ.

# బద్వేలు ఆర్టీవో కార్యాలయంలో శాంతి సమావేశం




బద్వేలు హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నియోజకవర్గ రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో మంగళవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హిందూ, ముస్లిం మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రమోహన్ మాట్లాడుతూ బద్వేల్ పట్టణం మతసామరస్యానికి నిలయం. ఈ సంప్రదాయాన్ని ఇలాగే ఎల్లప్పుడూ కొనసాగించాల ని కోరారు. ఇటీవల కడపలో జరిగిన సంఘటనల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా, హనుమాన్ జయంతి సందర్భంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పండుగను శాంతియుత వాతావరణంలో జరుపు కోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అందరూ సహకరించాలని మత పెద్దలకు సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బద్వేల్ అర్బన్ సీఐ రామకృష్ణ, బద్వేల్ తాసిల్దార్ పీర్ మున్ని, గోపవరం తాసిల్దార్ జీవన్ చంద్రశేఖర్, పలు మండలాల తహసీల్దార్లు×, సీఐ, ఎస్ఐలు, వివిధ శాఖల అధికారులు, హిందూ-ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట రూరల్ మండలం బండి చర్లపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూపంట కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైంది.ముఖ్యమంత్రి, మంత్రులు వెంటనే కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల కష్టాలను తెలుసుకోవాలి.మొక్కజొన్న మక్కలు, సన్‌ఫ్లవర్, శనగలు విక్రయించిన రైతులకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా చెల్లింపులు అందలేదు.మార్కెట్లలో ఇంకా సగం పైగా పంట నిల్వలు పేరుకుపోయి ఉన్నాయి, రైతులు 40 రోజుల నుండి ఎదురుచూస్తున్నారు వరి ధాన్యం తరలించడానికి లారీల కొరత తీవ్రంగా ఉంది. ఆర్టిఏ అధికారులు, వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మరియు పోలీసులను రంగంలోకి దించి, రోడ్లపై వెళ్లే ఖాళీ వాహనాలను మళ్లించి వెంటనే ధాన్యం తరలించాలి.రైస్ మిల్లులు ధాన్యం దించుకోవడం లేదని, ప్రభుత్వం రైస్ మిల్ అసోసియేషన్లతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలి.ప్రతి రైస్ మిల్లు వద్ద ఒక సివిల్ సప్లై లేదా రెవెన్యూ అధికారిని నియమించి పర్యవేక్షించాలిప్రభుత్వం సమస్యలను పరిష్కరించడం మానేసి, ప్రశ్నించిన వారిపై తిరుగుదాడి చేయడం, కేసులు పెట్టడం వంటి చర్యలకు పాల్పడుతోంది.వర్షాలు పడి పంట తడవకముందే యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేయాలిగతంలో మేం ఉన్నప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాలో అధికారులందరితో సమీక్షలు నిర్వహించి సమస్యలు లేకుండా చూశాం.ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు మరియు అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు వెళ్లిన లోడ్లను దించుకోవడం లేదు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా అస్తవ్యస్త పరిస్థితి నెలకొంది.రైతులు తమ పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్దే నెల రోజులుగా పడిగాపులు కాస్తున్నారు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.

# 'వీరభద్రుడు' థియేటర్స్ లో సెలబ్రేట్ చేసుకునే మాస్ మసాలా మూవీ : హీరో సూర్య



సూర్య మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు'. త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ భారీ అంచనాలని సృష్టించాయి. ఈ చిత్రం ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో రిలీజ్ అవుతుంది. మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్ లో హీరో కార్తి, డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాత సుప్రియా యార్లగడ్డ పాల్గొన్నారు.

ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో సూర్య మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులందరికీ నమస్కారం. నేను ఇక్కడికి వచ్చిన ప్రతిసారి చాలా అదృష్టవంతుడిగా భావిస్తాను. నాకు తెలుగు అంత బాగా రాకపోవచ్చు? కానీ తెలుగు వారి మనసు మాత్రం నాకు బాగా తెలుసు. సుప్రియ గారితో మాకు ఎప్పటినుంచో చాలా మంచి స్నేహం ఉంది. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాను రిలీజ్ చేయడం చాలా గౌరవంగా భావిస్తున్నాం. ఇంత అద్భుతమైన ప్రమోషన్స్, రిలీజ్ ప్లానింగ్ చేస్తున్న అన్నపూర్ణ స్టూడియోస్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమాతో ప్రేక్షకులు ఖచ్చితంగా చాలా సంతృప్తి పొందుతారు. రాకేందు మౌళి గారు చాలా చక్కని మాటలు రాశారు. రామజోగయ్య శాస్త్రి గారికి, శ్యామ్ గారికి థ్యాంక్యూ. చాలా మంచి పాటలు రాశారు. వాటికి మంచి స్పందన రావడం చాలా ఆనందంగా ఉంది. ఆర్.జే. బాలాజీ గారి జర్నీ ఎంతో స్ఫూర్తిదాయకం. ఆయన మల్టీ టాలెంటెడ్. ఈ కథను చాలా సిన్సియర్‌గా రాశారు? అంతే సిన్సియర్‌గా తెరకెక్కించారు. ఫస్ట్ హాఫ్ చాలా మంచి ఎమోషనల్ కోర్ట్‌రూమ్ డ్రామాగా సాగుతుంది. సెకండ్ హాఫ్ మాత్రం పూర్తి స్థాయి థియేటర్ మాస్ మసాలా మూమెంట్స్‌తో ఉంటుంది. చాలా మంచి హ్యూమర్, ఫన్ ఉంటాయి? ఇది నా ప్రామిస్. మే 14న ఈ సినిమా విడుదల అవుతోంది. ఈ సినిమాను నేను చాలా ఎంజాయ్ చేస్తూ చేశాను. ఆర్.జే. బాలాజీ, జీకే విష్ణు కలిసి నన్ను చాలా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఈ మధ్యకాలంలో వచ్చిన నా సినిమాలన్నింటికంటే చాలా డిఫరెంట్‌గా చూపించారు. త్రిషతో 23 ఏళ్ల తర్వాత కలిసి పనిచేసిన సినిమా ఇది. తను చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. విక్రమ్ గారు అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్‌లు డిజైన్ చేశారు. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరూ దీన్ని చాలా స్పెషల్‌గా ట్రీట్ చేసి పనిచేశారు. ఆ సిన్సియర్ ఎఫర్ట్ మీ అందరికీ సినిమాలో కనిపిస్తుంది. ఇది ఒక అద్భుతమైన ఎంటర్‌టైనర్. మీ ఆశీస్సులు, ప్రేమ మాకు కావాలి. మీ అందరి సపోర్ట్‌కి, అభిమానానికి హృదయపూర్వక ధన్యవాదాలు.

హీరో కార్తీ మాట్లాడుతూ..అందరికీ నమస్కారం. మీ ప్రేమకి హృదయపూర్వక కృతజ్ఞతలు. షూటింగ్ జరుగుతుండగా ఇక్కడ 'రోలెక్స్' ఉన్నారని చెప్పారు. అందుకే హాయ్ చెప్పాలని వచ్చాను. ( నవ్వులు). ఈ సినిమా ఫస్ట్ లుక్ నాకు చాలా నచ్చింది. ఇది మాస్ మసాలా అలాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని కూడా చెప్పొచ్చు. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. ట్రైలర్‌ని నేను చాలా ఎంజాయ్ చేశాను. గజని డేస్ గుర్తుకు వచ్చాయి. ఇలాంటి క్యారెక్టర్‌ను అన్నయ్య మాత్రమే చేయగలరు. ఆ మాస్ ఆయనకే సాధ్యపడుతుంది. నేను తప్పకుండా తెలుగు వెర్షన్ కూడా చూస్తాను. ఇలాంటి సినిమాలు థియేటర్‌లోనే చూడాలి. సినిమాను సెలబ్రేట్ చేసుకునే ప్రేక్షకుల కోసం తీసిన చిత్రం ఇది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. అలాగే వెంకీతో చేస్తున్న సినిమా కూడా మీ అందరి ప్రేమను అందుకోవాలని ఆశిస్తున్నాను. మీ అందరికీ ధన్యవాదాలు.

డైరెక్టర్ వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఒక డివైన్ ఎలిమెంట్‌తో పాటు సోషల్ యాంగిల్‌ను అద్భుతంగా మిక్స్ చేసి ఆర్.జే. బాలాజీ గారు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా అన్ని చోట్ల పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆర్.జే. బాలాజీ గారి ప్రయాణం చాలా స్ఫూర్తిదాయకం. ఆయన ఆర్జేగా ప్రారంభించి, దర్శకుడిగా, నటుడిగా? ప్రతి పాత్రలోనూ అద్భుతంగా రాణించారు. సూర్య గారిని, కార్తి గారిని తెలుగు ప్రేక్షకులు ఎంతగానో అభిమానిస్తారు. వాళ్ల సినిమాలు తమిళంలో రిలీజ్ అయితే ఎంత పండగలా ఉంటుందో, తెలుగులో కూడా అంతే పండగ వాతావరణం ఉంటుంది. సూర్య గారు ఎంతో హంబుల్ హ్యూమన్ బీయింగ్. ఆయనతో దాదాపు 90 రోజులు పని చేసే అవకాశం వచ్చింది. ఆయన చేసే సమాజ సేవ కూడా అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమా గొప్ప విజయాలు సాధించి, అద్భుతాలు క్రియేట్ చేయాలని కోరుకుంటున్నాను.

డైరెక్టర్ ఆర్.జే. బాలాజీ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సూర్య గారి సినిమాలను తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులు కూడా ఎంతో గొప్పగా సెలబ్రేట్ చేస్తుంటారు. ఈ సినిమాను కూడా అన్ని భాషల ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా అద్భుతంగా తీర్చిదిద్దాం. దర్శకుడిగా నేను సూర్య గారితో సినిమా చేస్తానని కలలో కూడా అనుకోలేదు. నాకు ఈ అవకాశం ఇచ్చిన సూర్య గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమాలో ఏముంటుందో ట్రైలర్‌లో కొంత మాత్రమే చూపించాం. సినిమాలో ఇంకా చాలా సర్ప్రైజ్‌లు ఉన్నాయి. ఇది పూర్తి స్థాయి ఎంటర్‌టైనింగ్ మాస్ మసాలా ఫిల్మ్. అభిమానులు చూడాలనుకునే సూర్య సార్‌ను ఈ సినిమాలో చూపించాం. సినిమాను సెలబ్రేట్ చేసుకునే ప్రేక్షకుల కోసం ఈ చిత్రాన్ని రూపొందించాం. ఈ సినిమాతో సూర్య గారికి ఒక బ్లాక్‌బస్టర్ ఇస్తానని నేను మాట ఇచ్చాను. ఖచ్చితంగా ఈ సినిమా మా నమ్మకాన్ని నిలబెడుతుంది. ఇది ఒక ఇంటెలిజెంట్ కమర్షియల్ ఫిల్మ్. సుప్రియ గారికి ధన్యవాదాలు. తెలుగు డైలాగ్స్‌ను రాకేందు మౌళి గారు అద్భుతంగా రాశారు. సాయి అభ్యంకర్ చాలా మంచి సంగీతం అందించారు. తప్పకుండా ఈ సినిమా మీ అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది.


రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇది చాలా అద్భుతమైన ఎమోషన్స్‌తో కూడిన సినిమా. పాటలన్నీ కూడా ఎంతో అద్భుతంగా వచ్చాయి. ఈరోజు ఈ వేడుకలో సూర్య గారిని, కార్తి గారిని పక్కపక్కన చూడడం కన్నుల పండుగలా అనిపించింది. సాయి అభ్యంకర్ చాలా అద్భుతమైన సంగీతం అందించారు. బాలాజీ గారి ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. ఈ సినిమా ఘనవిజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

రైటర్ రాకేందు మౌళి మాట్లాడుతూ..సూర్య గారు హీరోగా వస్తేనే అదరగొడతారు. ఇప్పుడు 'గాడ్ మోడ్'లో వస్తున్నారు? ఇక ఏ లెవెల్‌లో ఉంటుందో మీరే ఊహించుకోవచ్చు. ఈరోజుల్లో న్యాయం అనేదే ఒక మిరాకిల్ అయిపోయింది. ఆ మిరాకిల్‌ని చూడాలంటే దేవుడే దిగి రావాలి అన్నట్టుగా పరిస్థితులు ఉన్నాయి. అలా దిగివచ్చిన దేవుడే 'వీరభద్రుడు'. ఎస్.ఆర్. ప్రభు గారు 'ఖైదీ' సినిమాకు నాకు మొదటిసారి డైలాగ్స్ రాసే అవకాశం ఇచ్చారు. అక్కడి నుంచి వరుసగా ఎన్నో సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. కార్తి అన్న ఎప్పుడూ నాకు సొంత తమ్ముడిలా సపోర్ట్ చేస్తుంటారు. సూర్య అన్న కూడా నాకు సొంత అన్నయ్యలానే. 'వీరభద్రుడు' అన్యాయాన్ని అస్సలు వదలడు. మే 14న మీ ముందుకు వస్తున్నాడు. అందరూ థియేటర్లలో చూసి ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను.

ఫైట్ మాస్టర్ విక్రమ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నేను 'కాంతార', 'కేజీఎఫ్ చాప్టర్ 1' చిత్రాలకు ఫైట్ మాస్టర్‌గా పనిచేశాను. నాకు రెండు నేషనల్ అవార్డులు వచ్చాయి. ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన సూర్య గారికి ధన్యవాదాలు. సూర్య గారు ఫైట్స్‌కి చాలా ప్రాధాన్యత ఇస్తారు. రిహార్సల్స్‌కు కూడా ఎంతో క్రమశిక్షణతో ముందుగానే వచ్చేస్తారు. ఆయన మొదటి సినిమాలో ఉన్న ఎనర్జీని ఇప్పటికీ అలాగే కొనసాగిస్తున్నారు. నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ బాలాజీ గారికి థ్యాంక్యూ. టీమ్ అంతా ఎంతో సపోర్ట్ చేశారు. ఈ సినిమాలో ఫైట్స్ చాలా అద్భుతంగా వచ్చాయి. ఈ సినిమా మీ అందరికీ తప్పకుండా నచ్చుతుంది.

తారాగణం: సూర్య, త్రిష, ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి, శ్శివాద, సుప్రీత్ రెడ్డి

## వరుణ్ సందేశ్ హీరోగా కొమర మీడియా వర్క్స్ బ్యానర్ పై పూజా కార్యక్రమాలతో "నా వైఫ్ మిస్సింగ్" చిత్ర ప్రారంభం




వరుణ్ సందేశ్ హీరోగా కొమర మీడియా వర్క్స్ బ్యానర్ పై ఆహా సమర్పణలో శివ కంఠంనేని, ఆర్ వెంకటేశ్వర రావు నిర్మాతలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం "నా వైఫ్ మిస్సింగ్". ఇటీవలే నయనం వెబ్ సిరీస్ ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్న స్వాతి ప్రకాష్ మంత్రిప్రగడ దర్శకత్వంలో సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్ లో ఒక చక్కటి ప్రేమ కథగా ఈ చిత్రం రానుంది. ప్రవీణ్, మోహిత్, సత్య శ్రీ (జబర్దస్త్) తదితరులు కీలకపాత్రలు పోషించనున్నారు. సతీష్ కుమార్ ఎన్ఎస్ సినిమాటోగ్రఫీ చేయనున్న ఈ చిత్రానికి సాయి బాబు తలారి ఎడిటింగ్ చేస్తున్నారు. ఎన్నో చిత్రాలకు హిట్ మ్యూజిక్ అందించిన సాయి కార్తీక్ సంగీతం అందిస్తున్నారు. ఉమర్జీ అనురాధ ఈ చిత్ర కథను అందించగా శ్రీనివాస్ మండల స్క్రీన్ ప్లే రైటర్ గా ఉండగా ఆదిత్య భార్గవ్ డైలాగ్స్ అందిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం పూజ కార్యక్రమాలతో ప్రారంభం కావడం జరిగింది. ఆహా బృందం స్క్రిప్ట్ అందించగా సీనియర్ నిర్మాత సి కళ్యాణ్ గారు మొదటి క్లాప్ కొట్టారు. నటుడు, నిర్మాత, ఫిలిం ఛాంబర్ సెక్రటరీ గౌరవనీయులు అశోక్ కుమార్ గారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా దర్శకుడు, జాతీయ అవార్డ్ గ్రహీత నీలకంఠ గారు తొలి షాట్ కు దర్శకత్వం వహించారు. కాగా నేటి నుండి ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఇక ఈ చిత్రానికి సంబంధించిన ఇతర అప్డేట్స్, మిస్ అయిన వైఫ్ ఎవరు? అనే విషయాలు చిత్ర బృందం క్రమంగా విడుదల చేయనుంది. నటీనటులు : వరుణ్ సందేశ్, ప్రవీణ్, మోహిత్, సత్య శ్రీ (జబర్దస్త్) తదితరులు.

## 'సిస్టమ్' మూవీ ట్రైలర్ విడుదల

ప్రైమ్ వీడియో తమ కొత్త ప్రైమ్ ఒరిజినల్ సినిమా సిస్టమ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. కోర్ట్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో పవర్, న్యాయం మధ్య జరిగే పోరాటాన్ని ఆసక్తికరంగా చూపించారు. ఈ చిత్రానికి అశ్విని అయ్యర్ తివారి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సోనాక్షి సిన్హా, జ్యోతిక, అశుతోష్ గోవరికేర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా మే 22 నుంచి ప్రైమ్ వీడియో లో మన దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్‌లో నేహా అనే యువ లాయర్ పాత్రలో సోనాక్షి సిన్హా కనిపించారు. తన తండ్రిలా ఫర్మ్‌లో పార్ట్నర్ కావాలని ఆశపడే ఆమె, తన ప్రతిభను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో కోర్ట్ స్టెనోగ్రాఫర్ సారిక పాత్రలో నటించిన జ్యోతికతో కలిసి పని చేస్తుంది. అయితే సారికకు కొన్ని గోప్యమైన ఉద్దేశాలు కూడా ఉంటాయి. కోర్ట్ సన్నివేశాలు, భావోద్వేగాలు, ఆలోచింపజేసే డైలాగులతో ట్రైలర్ ఆకట్టుకుంటోంది."పవర్ ముందు నిజం నిలబడగలదా? న్యాయం గెలుస్తుందా?" అనే ప్రశ్నను సినిమా ప్రధానంగా చూపించబోతోంది. దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారి మాట్లాడుతూ, నిజ జీవితానికి దగ్గరగా ఉండే కథతో ఈ సినిమా రూపొందిందని తెలిపారు. అలాగే సోనాక్షి సిన్హా, జ్యోతిక ఈ చిత్రం తమ నటనకు కొత్త సవాల్‌గా నిలిచిందని చెప్పారు. ప్రేక్షకులను ఆలోచింపజేసే కథలను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లడంలో ప్రైమ్ వీడియో మంచి వేదిక అని ఆమె అభిప్రాయపడ్డారు.

## రెండు పార్ట్ లుగా విశ్వంభర




హైదరాబాద్, మే 12, మెగాస్టార్ చిరంజీవి లాంగ్ అవైటెడ్ మూవీ 'విశ్వంభర' కోసం మెగా అభిమానులు ఎంత ఆతృతగా ఎదురు చూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఎప్పుడో 2023 వ సంవత్సరం లోనే షూటింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని , గ్రాఫిక్స్ క్వాలిటీ ఔట్పుట్ కోసం ఇన్ని రోజులు విడుదల చేయకుండా, అనుకున్న ఔట్పుట్ వచ్చే వరకు ఎదురు చూశారు . ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించిన పనులు మొత్తం పూర్తి అయ్యాయి. ప్రస్తుతం రీ రికార్డింగ్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. సాధ్యమైనంత వరకు ఈ చిత్రాన్ని జులై నెలలో విడుదల చెయ్యాలని చూస్తున్నారు మేకర్స్. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా బయటకు రానున్నాయి. ఇదంతా పక్కన పెడితే ఈ చిత్రానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన వార్త నిన్నటి నుండి సోషల్ మీడియా లో జోరుగా ప్రచారం సాగుతోఅదేమిటంటే ఈ చిత్రాన్ని కేవలం ఒక భాగంగా మాత్రమే విడుదల చేసేలా కాకుండా, రెండు భాగాలుగా విడుదల చెయ్యాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్టు వార్తలు వినిపించాయి. సినిమా ఫైనల్ ఔట్పుట్ నాలుగు గంటలకు పైగానే వచ్చిందని , కొన్ని మార్పులు చేర్పులు చేసి రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని విడుదల చెయ్యాలని డైరెక్టర్ వశిష్ఠ అనుకుంటున్నాడని , సోషల్ మీడియా లో జోరుగా ప్రచారం సాగింది. దీనిని ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ మూర్తి ట్విట్టర్ లో తెలియజేయగా, డైరెక్టర్ బాబీ వెంటనే రెస్పాన్స్ ఇచ్చారు. సెటైరికల్ టోన్ లో మాట్లాడుతూ 'అవునా.. నిజమా' అంటూ రిప్లై ఇచ్చాడు. దీంతో ఒక్కసారిగా అందరికీ ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల అవ్వబోవడం లేదు, కేవలం ఒక్క భాగంగా మాత్రమే విడుదల అవుతుందని క్లారిటీ ఇచ్చారు. దీంతో రెండు భాగాలుగా ఈ చిత్రం విడుదల అవ్వబోతుంది అనే రూమర్ కి చెక్ పడింది.ఇకపోతే ఈ సినిమా ఫైనల్ ఔట్పుట్ పై మెగాస్టార్ చిరంజీవి చాలా సంతృప్తిగా ఉన్నాడట. ముఖ్యంగా విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని , అభిమానులను ఇంతకాలం ఎదురు చూసేలా చేసినప్పటికీ, మంచి ఔట్పుట్ ని వాళ్లకు అందించబోతున్నామని , ఈ సినిమా ఎప్పుడు విడుదలైనా సంచలనాలను సృష్టిస్తుందని బలమైన నమ్మకం తో చెప్పాడట. మరి ఇందులో ఎంత మాత్రం నిజముందో తెలియాలంటే సినిమా విడుదల వరకు ఆగాల్సిందే. ఇకపోతే ఈ చిత్రం లో హీరోయిన్ గా త్రిష నటించగా, ఆశికా రంగనాథ్ కీలక పాత్ర పోషించింది. అదే విధంగా ఇషా చావ్లా , సురభి వంటి యంగ్ హీరోయిన్స్ చిరంజీవి కి చెల్లెళ్లుగా నటించారు.

## "దూరదర్శని" మూవీ 90వ దశకం రోజులను గుర్తకు తెస్తుంది : దర్శకుడు కార్తికేయ కొమ్మి



సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శిని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయ శంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని పనులను పూర్తిచేసుకున్న ఈ చిత్రం మే 15న విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శకుడు కార్తికేయ కొమ్మి చిత్ర విశేషాలను పంచుకున్నారు. ఆ విశేషాలివి.

మీ నేపథ్యం ఏమిటి?ఇంతకు ముందు నేను సాధ్యం, వసూల్ రాజా, లక్ష్మీబాంబ్ సినిమాలకు దర్శకత్వం చేశాను. నేను కొత్తవాళ్లతో చేసిన తొలి ప్రాజెక్ట్ ఇది. యదార్థ సంఘటనతో చాలా రియలిస్టిక్‌గా ఈ సినిమాను రూపొందించాను.

దూరదర్శని కథ ఏమిటి?

కథగా చెప్పుకుంటే పేరెంట్స్ చాయిస్, సొసైటీ చాయిస్, పిల్లల చాయిస్.. వీటి మధ్య ఉండే క్లాష్.. ఈ చిత్ర కథాంశం.చిత్రలహరి టైమ్ పిరియడ్ మిస్ అయిన వారికి. ఆ టైమ్‌లో చిత్రలహరి అనుభూతిని పొందిన వారికి ఈ సినిమా పూర్తి సంతృప్తినిస్తుంది. చిత్రలహరి గురించి అందరూ ఎలా వెయిట్ చేసే వారు.. అక్కడ జరిగే ప్రేమకథ. చిత్రలహరి అనేది గ్యాదరింగ్ పాయింట్‌లా ఎలా ఉండేది. అందరూ ఇది కేవలం లవ్‌స్టోరీ అనుకుంటున్నారు. కానీ ఈ చిత్రంలో తల్లిదండ్రులకు, యూత్‌కు, సమాజానికి నచ్చే అంశాలు ఉన్నాయి. అందరికి 90వ దశకం రోజులను గుర్తకు తెస్తుంది. అందరూ చిత్రలహరి పోగ్రామ్ కోసం వేచి చూసిన రోజులు గుర్తుకు వస్తాయి. ఈ సినిమాలో మంచి ఎమోషన్ ఉంది. అందరి హృదయాలను హత్తుకుంటుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరికి వాళ్ల గోల్డెన్ డేస్‌లోకి తీసుకవెళుతుంది.

ఇటీవల తిమ్మరాజు పల్లి టీవీకి అనే సినిమా వచ్చింది ఆ సినిమాతో ఏమైనా పోలికలు ఉంటాయా?

కథ విషయంలో ఆ సినిమాకు ఈ సినిమాకు సంబంధం లేదు. ఇది కంప్లీట్ ఎమోషన్ సినిమా. ఫాదర్, సన్‌కు మధ్య ఉన్న ఎమోషన్.. ఈ సినిమాలోని ప్రతి సన్నివేశం మీ హృదయాలకు హత్తుకుంటుంది.

# ఈ.వి.యం. గోదాం నెలవారి తనిఖీ నిర్వహించిన :: జిల్లా కలెక్టర్ బోర్గడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 12 2026 ములుగు** మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్గడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను తనిఖీ చేశారు. గోదాంలో అమర్చిన సీసీ కెమెరాల పనితీరును,అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్టింగిషర్లను ఇతర అగ్నిమాపక పరికరాలను తనిఖీ చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఉన్న పోలీస్ బందోబస్తును మరియు రిజిస్టర్లను కలెక్టర్ తనిఖీ చేశారు. భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఈవీఎంల భద్రత విషయంలో అత్యంత పారదర్శకతను పాటిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే గోదాం తనిఖీ చేయడం జరిగిందని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ ఎండి సలీం, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో యోగ మరియు ధ్యాన కార్యక్రమ నిర్వహణ.



**ములుగు జిల్లా ప్రజ బలం ప్రతినిధి మే 12 2026 ఏటూరు నాగారం** తెలంగాణ ప్రభుత్వము మరియు కమిషనర్ ఆఫ్ కాలేజియెట్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాలమేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏటూరు నాగారం లో మంగళవారం 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఏడు రోజుల విద్యా వారోత్సవాల కార్యక్రమం లొ భాగంగా రెండవ రోజు యోగ మరియు ధ్యాన కార్యక్రమం ను నిర్వహించారు.

ఈకార్యక్రమం లో అధ్యాపకులు డాక్టర్. డి. నవీన్, సీహెచ్.వెంకయ్య, డాక్టర్, పి. జ్యోతి, కనీస్ ఫాతిమా,సంపత్, జీవవేణి,భావన, భాస్కర్,శ్రీకాంత్ మరియు బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు







**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 12 2026 ఏటూరు నాగారం** ఐటీడీఏ ప్రసన్నాంజనేయ స్వామి,అభయ అంజనేయ స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు,అన్న ప్రసాద వితరణ....

ఏటూరునాగారం లోని ఐటీడీఏ వద్ద క్రాస్ రోడ్ లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాన్ని హనుమాన్ జయంతి సందర్భంగా సర్వాంగ సుందరంగా పూల మాలలతో,మామిడి తోరణాలతో అలంకరించారు.ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం లో అర్చకులు ఏళ్ళ ప్రగడ సూర్య నారాయణ శర్మ, రాం శర్మ, జస్వంత్ శర్మ ,కమిటీ ఆధ్వర్యంలో, ఇటు ఓడవాడ లోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయం లో ఒకటో వార్డు మెంబెర్ అంగాల వీరన్న కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు , నిర్వహించారు. హనుమాన్ కి అభిషేకం, అర్చనలు, పుష్పార్చన పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. జై హనుమాన్ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం ఒక్కసారిగా దద్దరిల్లింది.అన్న ప్రసాదం వేలాది మంది స్వీకరించి హనుమాన్ ఆశీస్సులు పొందారు. విచ్చేసిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే వేసవి తాకిడిని తట్టుకునేందుకు ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం దగ్గర చల్లని మజ్జిగ భక్తులకు అందచేసి దాహార్తిని తీర్చారు. విచ్చేసిన భక్తులు ఆలయ కమిటీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో ఆలయ సమన్వయ కర్తలు వంగమూరి గౌతమ్ కుటుంబ సభ్యులు, వార్డు సభ్యులు నాగవత్ కిరణ్, జనార్దన్, శ్రావణ్, శంకర్,ఇస్లావత్ శివ సాయిబాబా దేవాలయం చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, గంజి రమేష్, జగదీష్, తో పాటు అంజన్న మలా దారులు, మలా విరమణ దారులు గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జలమెమొ అడుగంటె, జల మండలీ పలుకదాయే




**రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 12 మే 2026.** జలమెమొ అడుగంటె, జల మండలీ పలుకదాయే అన్న చందన మణికొండ, నెక్నంపూర్ మున్సిపల్ డివిజన్ ప్రజలు దాహమొ రామచంద్రా అని అలమటిస్తున్నారు. భూగర్భ జలాల మట్టం దాదాపు 2000 అడుగులకు పడిపోయి, అనేక బోర్వెల్లు ఎండిపోయి తీవ్రమైన నీటి సంక్షోభం నెలకొన్న ప్రస్తుత తరుణంలో పైప్‌లైన్ ద్వారా తాగు నీటి సరఫరా కేవలం 30 – 40 నిమిషాల పాటు మాత్రమే అందుతోంది. దీంతో వేలాది కుటుంబాలు తమ నిత్యావసరాల కోసం ట్యాంకర్ నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నీరు జీవానికి ఆధారం. నీరు లేకుండా జీవం లేదు. కాబట్టి ఇది రాజకీయాలకు అతీతమైన సమస్య. కులం, మతం, కాలనీ, రాజకీయ అనుబంధం అనే తేడా లేకుండా ప్రతి ఇంటిని ప్రభావితం చేస్తున్న అంశం. అందువల్లన తగినంత తాగునీటి సరఫరా కోసం మన మందరం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా గ్రామపంచాయతీ కాలంలో ఇచ్చిన నీటి కనెక్షన్లకు ఐదేళ్ల బిల్లులను భారీగా విధించడం ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆ వివాదాస్పద మరియు అన్యాయమైన బిల్లులను చెల్లించలేక పోతున్న ప్రజలకు, బలహీన వర్గాల కాలనీలతో సహా, ట్యాంకర్ నీటి సరఫరాను కూడా నిరాకరిస్తున్నట్లు సమాచారం. దీని వల్ల మహిళలు, వృద్ధులు, పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ తీవ్ర పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం మన ప్రాథమిక హక్కైన నీటి కోసం ప్రస్తుత మరియు భావితరాల భవిష్యత్తు కోసం మనమందరం కలసి కట్టుగా పెద్ద ఎత్తున 17 మే 2026 ఆదివారం రోజున సాయంత్రం 4 గంటలకు నెక్నంపూర్ బటర్‌ఫ్లై సర్కిల్, పుప్పాలగుడా పోస్టు ఆఫీసు, మణికొండ మర్రిచెట్టు, జల మండలి కార్యాలయం వరకు నిర్వహిస్తున్న "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమానికి వి ఆర్ 4 సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ తమ సంపూర్ణ మద్దతు తెలుపుతూ స్థానిక ప్రజలు ఇట్టి కార్యక్రమంలో రాజకీయలకు అతీతంగా, శాంతియుతంగా, ఐక్యంగా ప్రతి ఒక్కరూ పాల్గొన వలసిందిగా కొరదమయినది.

# జహీరాబాద్- బీదర్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం ఐదు మంది మృతి



**జహీరాబాద్, మే 12 ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ కర్ణాటక సరిహద్దులో బీదర్ – జహీరాబాద్ రోడ్డుపై శంషల్లాపూర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు మృతి చెందగా నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను కర్ణాటక బీదర్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నారు. జహీరాబాద్ – బీదర్ రోడ్డు, తెలంగాణ కర్ణాటక సరిహద్దు వద్ద మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బీదర్ నుండి హైదరాబాద్కు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ఇద్దరు



న్యాల్ కల్ మండలానికి చెందిన వారిని సమాచారం. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# జి.ఆర్. నికితకు డాక్టరేట్ ప్రదానం: ఇంగ్లీష్ బోధనా పద్ధతులపై విశేష పరిశోధన





**మే 12 2026 హైదరబాద్ (ప్రజాబలం ప్రతినిధి)**

ఇంగ్లీష్ భాషా బోధనలో పరిశోధనాత్మక కృషికి గుర్తింపుగా జి.ఆర్. నికితకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (Ph.D.) పట్టా లభించింది. భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ వైస్-చాన్స్‌లర్ డా. కె. నాగజ్యోతి చేతుల మీదుగా ఆమె ప్రతిష్టాత్మక డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఇంగ్లీష్ (జూు) విభాగంలో ఆమె సమర్పించిన "తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన జిల్లాల ప్రభుత్వ మరియు ప్రైవేట్ కళాశాలల్లో టాస్క్-బేస్డ్ అప్రోచ్ ద్వారా రచనా నైపుణ్యాల అభివృద్ధి" అనే పరిశోధన విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థుల రచనా నైపుణ్యాలను మెరుగుపరచడంలో టాస్క్-బేస్డ్ అప్రోచ్ ప్రభావాన్ని ఈ అధ్యయనం విశ్లేషించింది.ఇంగ్లీష్ భాషా బోధనలో రచనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపయోగపడే పలు టాస్క్-బేస్డ్ కార్యకలాపాలను ఈ పరిశోధనలో వివరించినట్లు తెలిపారు. విద్యార్థుల విద్యా, వృత్తిపరమైన అభివృద్ధికి అవసరమైన రచనా నైపుణ్యాల పెంపుకు ఈ అధ్యయనం దోహదపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.ఆధునిక ఇంగ్లీష్ బోధన విధానాలకు ఈ పరిశోధన అందించిన ప్రాయోగిక సూచనలు, విలువైన అంశాలను పలువురు విద్యావేత్తలు ప్రశంసించారు. ఈ సందర్భంగా డా. నికిత తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ వైస్-చాన్స్‌లర్ డా. కె. నాగజ్యోతి, పరిశోధనా మార్గదర్శకురాలు డా. డి. సునీల, తన భర్త, తల్లిదండ్రులు, సోదరుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలి.

## వేసవి కాలం దృష్ట్యా జిల్లా కేంద్రం లో చలివేంద్రాల సంఖ్య పెంచాలి

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 12 2026 ములుగు** మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ములుగు జిల్లా తాత్కాలిగ బస్టాండ్ ఆవరణ పరిసరాలను,ములుగు మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రకృతి వనాన్ని, చలి వేంద్రాలను పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా తాత్కాలిక బస్ స్టాండ్ ఆవరణ పరిసరాలను పరిశీలించి బస్సుల సమయపాలన,వసతుల కల్పన పలు అంశాలను అడిగి తెలుసుకొని తప్పనిసరిగా ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.పట్టణ ప్రకృతి వనాన్ని పరిశీలించి మొక్కలు ఎండి పోకుండా సమృద్ధిగా నీరు అందించాలన్నారు.వేసవి కాలంలో దృష్టిలో ఉంచుకొని ప్రజలు రద్దీ ఉండే ప్రదేశాలలో మరిన్ని చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో మున్సిపాలిటీ కమిషనర్ జనగాం సంపత్ రెడ్డి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కాళ్ల రామకృష్ణకు 'దళిత రత్న' పురస్కారం - హనుమకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించిన

## ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 12 2026 ములుగు** ములుగు జిల్లా ఎటూరు నాగారం మండల కేంద్రానికి చెందిన
కాళ్ళ రామకృష్ణ కు సామాజిక సేవలో తనదైన ముద్ర వేస్తూ, అణగారిన వర్గాల గొంతుక గా నిలుస్తున్న మాల మహానాడు ఆఫ్ ఇండియా ములుగు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శ్రీ కాళ్ల రామకృష్ణ గారికి ప్రతిష్ఠాత్మక దళిత రత్న పురస్కారం లభించింది.
ఈ సందర్భంగా హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట శాసనసభ్యులు శ్రీ కే.ఆర్. నాగరాజు రామకృష్ణను ప్రత్యేకంగా అభినందించి, తన చేతుల మీదుగా అవార్డును అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు మాట్లాడుతూ రామకృష్ణ వంటి యువ నాయకులు సామాజిక బాధ్యతతో పనిచేయడం అభినందనీయమని కొనియాడారు. మాల మహానాడు ఆఫ్ ఇండియా ములుగు జిల్లా కమిటీ సభ్యులుగా ఉంటూ, జాతి అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.
తనను ఈ అవార్డుకు ఎంపిక చేయడంలో కీలక పాత్ర పోషించి, వెన్నంటి ప్రోత్సహించిన లిడాక్టర్ పసుల రామ్మూర్తికి రామకృష్ణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే తనపై నమ్మకంతో అవార్డును అందజేసిన ఎమ్మెల్యే నాగరాజు గారికి, మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. అణగారిన వర్గాల కోసం తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఆఫ్ ఇండియా ములుగు జిల్లా కమిటీ నాయకులు, ఇతర ముఖ్య ప్రతినిధులు పాల్గొని రామకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా నర్సింగ్ దినోత్సవం.

## ఆరోగ్య సేవలో ఆసుపత్రికి వెన్నుముక లాంటివారు నర్సులే....

## సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ రవిశంకర్...



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం పురస్కరించుకొని ఆసుపత్రి ఆవరణలో తెలంగాణ నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలోని సమావేశపు హాల్ లో వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.ప్రతి ఆసుపత్రిలో వైద్యులు సూచించిన ఆరోగ్య సేవలు అందించుటలో ప్రధాన పాత్ర పోషిస్తున్న నర్సులే ఆసుపత్రికి వెన్నుముక లాంటి వారని ఆయన అభివర్ణించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినోత్సవాన్ని నర్సింగ్ దినోత్సవంగా జరుపుకోవాలని ఆనవాయితీగా వస్తుందని అన్నారు.నాగర్ కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రారంభమై 4 సంవత్సరాల లో రోగి సేవలో గణనీయమైన ప్రగతి సాధించుటలో నర్సుల పాత్ర కీలకమని అన్నారు.క్లాస్మేట్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నర్సింగ్ అధికారులనుశలువాలతో ఘనంగా సన్మానించారు. క్లాస్మేట్ క్లబ్ ద్వారా 365 రోజులు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని విద్య, వైద్య,వైజ్ఞానిక, సామాజిక,ఆధ్యాత్మిక సేవలోముందుంటున్నామని క్లాస్మెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు వాస రాఘవేందర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ అజీమ్,నర్సింగ్ సూపర్డెంట్ మంజుల ,పేర్సి సుమన్,నాగవేణి,పద్మ, సునీత,తెలంగాణనర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు జానకి దేవి కార్యదర్శి ఎం.ఆనంద్, జోనల్ అధ్యక్షులు మన్మోహన్ రెడ్డి,కెశవ్, రాజు,హరి,సాయి, హరికృష్ణ,మరియమ్మ. పుష్పలత,సరస్వతి, రూప,నిర్మల,సునిత, సువేద,పద్మ,కవిత క్లాస్మేట్ క్లబ్ సభ్యులు పోలా శ్రీనివాసులు, కే.పి.ప్రసాద్,చిగుళ్లపల్లి రమణ కుమార్,మల్లేష్, రామచంద్రయ్య,యాదగిరి, నర్సింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు మార్కెట్ ధరలకు అనుగుణంగా పరిహారం అందజేయాలి:

## వ్యకాస జిల్లా అధ్యక్షులు రామ చందర్



**జహీరాబాద్ , మే 12 ప్రజాబలం ప్రతినిధి:** నిమ్జ్ పరిధిలోని హద్నూర్, మామిడిగి, గుంజెటి, హుసేల్లి, ఎల్గొయి గ్రామాల రైతులు నిమ్జ్ పరిధిలోని భూముల వాస్తవ ధరల ఆధారంగా భూముల విలువలు పెంచాలని, హైకోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు బి. రాంచందర్ మాట్లాడుతు నిమ్జ్ పరిధిలోని రైతుల భూముల విలువలపై హైకోర్టు ఇచ్చిన ఔా. చీశీ. 14183/2026 ఆదేశాలను సంబంధిత అధికారులు వెంటనే అమలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.
హైకోర్టు ఆదేశాల మేరకు పిటిషన్ దారుల అభిప్రాయాలు తీసుకొని, చట్టపరమైన విధానాలను పాటిస్తూ రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అయినప్పటికీ భూముల విషయంలో రైతుల అభ్యంతరాలను పట్టించుకోకుండా చర్యలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గారికి, రెవెన్యూ డివిజనల్ అధికారి (=ఖూ) గారికి, సబ్-రిజిస్ట్రార్ గారికి, జిల్లా రిజిస్ట్రార్ గారికి వినతిపత్రాలు సమర్పించడం జరిగింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే రైతాంగం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.

## కేంద్ర మంత్రి బండి కుమారుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే మాణిక్ రావు




జహీరాబాద్ మే 12 ప్రజాబలం ప్రతినిధి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో(ఖూజుఖూ) కేసు మరియు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే మాణిక్ రావు గారు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ గారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.
మంగళవారం క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్రమంత్రి కుమారుడు పరారీలో ఉన్నాడనడం హాస్యాస్పదం అన్నారు.
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిసిట్ విచారణ పేరిట నిందితుణ్ణి తప్పించే ప్రయత్నం చేస్తున్నాడని ఎమ్మెల్యే ఆరోపించారు.
ఒక మైనర్ బాలికపై డ్రగ్స్, మద్యం ఇచ్చి అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వస్తున్నా, పోలీసులు మూడు నెలల పాటు ఫిర్యాదు తీసుకోకుండా తాత్సారం చేయడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందని ఆరోపించారు. మీడియాలో వార్తలు వచ్చిన తర్వాతే గత్యంతరం లేక పోలీసులు కేసు నమోదు చేశారని మండిపడ్డారు.పోక్సో చట్టం ప్రకారం మైనర్ బాలిక చెప్పేది వేదం అని, అటువంటి కేసులో బాధితురాలికి రక్షణ కల్పించాల్సింది పోయి.. నిందితుడు ఆమెపైనే తిరిగి 'హనీ ట్రాప్' పేరుతో కేసు పెట్టడం దారుణమని అన్నారు. మైనర్ బాలిక హనీ ట్రాప్ చేస్తుందా? అని ఆయన ప్రశ్నించారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒకటేనని అర్థమవుతోందన్నారుఒక కేంద్ర మంత్రి కొడుకుపై ఇంత పెద్ద నేరం మోపబడినా ప్రభుత్వం మిన్నకుండిపోయిందని, ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా దీనిపై స్పందించకపోవడం వెనుక ఉన్న మర్మమేమిటని ప్రశ్నించారు. ఇతరుల వ్యక్తిగత విషయాలను రాజకీయం చేసే సంజయ్ ఇప్పుడు తన కొడుకుపై వచ్చిన ఈ పోక్సో కేసుపై నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.
ఈ కేసులో రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలన్నారు.బాధితురాలికి మరియు ఆమె కుటుంబానికి తక్షణమే పూర్తిస్థాయి రక్షణ కల్పించాలి అని డిమాండ్ చేసారు.రాష్ట్ర పోలీసులు ఇప్పటికైనా ఒత్తిళ్లకు లొంగకుండా చట్టాన్ని గౌరవించాలని, బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పార్టీ తాము పోరాడుతామని అని అన్నారు .ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం,న్యాల్కల్ మండల పార్టీ అధ్యక్షులు రవీందర్, కొహిర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, సర్పంచ్ మచెందర్,ప్రవీణ్ , కౌన్సిలర్ గౌస్ గోరీ ,నాయకులు రాజ్ కుమార్,జగదీష్ ,రాజు పటేల్,హాశం , అలీ తదితరులు పాల్గొనారు.

## అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నర్సులకు శుభాకాంక్షలు.

## తెలిపిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే12 ( ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా, నర్సులందరికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ,ప్రజారోగ్య సంరక్షణలో అసమాన సేవలు అందిస్తున్న నర్సుల, సేవలను కొనియాడారు, ప్రతిఫలం ఆశించకుండా అవిశ్రాంతంగా, నిబద్ధతతో నర్సులు, అందించే సేవలు అద్వితీయమన్నారు నర్సుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు, అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా నిర్వహించిన, పరీక్షలలో అర్హత సాధించిన 1919, మంది నర్సింగ్ ఆఫీసర్స్, కు ఈ రోజు నియామక పత్రాలను అందజేస్తున్నామన్నారు.

## రసాయన ట్యాంకర్‌లో అగ్నిప్రమాదం




**జహీరాబాద్, మే12 ప్రజా బలం ప్రతినిధి:** మొగడంపల్లి మండలం, మాడిగి గ్రామ శివారులో లో సోమవారం రాత్రి ఒక రసాయన ట్యాంకర్‌లో అగ్నిప్రమాదం సంభవించి అది పూర్తిగా కాలిపోయింది. ముంబై నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్యాంకర్ లో అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. వెంటనే గుర్తించిన డ్రైవర్ ట్యాంకర్‌ను రోడ్డు పక్కకు ఆపాడు. మంటలు పూర్తిగా వ్యాపించడంతో, డ్రైవర్, అతని సహాయకుడు కిందకు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. ట్యాంకర్‌లో మంటలు వ్యాపించిన విషయాన్ని పలువురు చిరాగ్ పల్లి పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేసరికి, రసాయన ట్యాంకర్ పూర్తిగా కాలిపోయింది. చిరకుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# ధాన్యం కొనుగోళ్ల వేగవంతంపై ప్రత్యేక దృష్టి

## అధికారుల క్షేత్ర స్థాయి పర్యటనలతో సమస్యల పరిష్కారం



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 12: (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, ప్యాక్స్, మెప్మా, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించడానికి, రైతులకు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో పాటు, జిల్లాలోని మండలాల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఇతర సిబ్బంది తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, క్షేత్ర స్థాయిలో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచనలు చేస్తూ, కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. రైతుల నుండి తూకం వేసి సేకరించిన ధాన్యం మిల్లులకు తరలించేందుకు వాహనాలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లాలోని తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి షర్ఫుద్దీన్, వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి, నూకలమర్రి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి లక్ష్మీరాజం మంగళవారం తనిఖీ చేశారు. అలాగే మిగతా మండలాల ప్రత్యేక అధికారులు, మండలాల తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నారు.



# ములుగులో హౌస్ లిస్టింగ్ పనులను పరిశీలించిన సెన్సస్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారాజు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 12 2026 ములుగు**మున్సిపాలిటీలోని సూపర్‌వైజర్ సర్కిల్‌లో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు ఇంటి నంబర్లను ఎలా కేటాయిస్తున్నారో, పని సక్రమంగా జరుగుతుందో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ప్రతి ఇంటి నంబర్ ఎదురుగా సీఎన్ అని తప్పనిసరిగా రాయాలని, అపాయింట్మెంట్ ఆర్డర్లు వచ్చాయో లేదో, మ్యాపింగ్ ఎలా చేస్తున్నారో కూడా ఆయన ఆరా తీశారు. పనుల్లో వేగం పెంచాలని, తప్పులు లేకుండా చూడాలని మున్సిపాలిటీ ఛార్జ్ అధికారికి తగిన సూచనలు ఇచ్చారు.

ఎన్యూమరేటర్లకు కేటాయించిన హౌస్ లిస్టింగ్ బ్లాక్ హెచ్ ఎల్ బి పరిధిని స్పష్టంగా తెలియజేసేందుకు మున్సిపాలిటీ నుంచి మూడు రోజుల పాటు సిబ్బందిని వారి వెంట పంపించాలని ఆదేశించారు.

జిల్లాలోని అన్ని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు 13.05.2026 సాయంత్రం లోపు తమకు కేటాయించిన ప్రతి ఇంటికి ఇంటి నంబర్లు పూర్తి చేయాలని సూచించారు. జూన్ 9 వరకు ఈ పని కొనసాగుతుందని, అందరూ అదే స్ఫూర్తితో పని చేయాలని ఛార్జ్ అధికారులు, అడిషనల్ ఛార్జ్ అధికారులను కోరారు. రోజువారీ పనితీరుపై మానిటరింగ్ చేయాలని కూడా ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సెన్సస్ ఇంచార్జ్ వినయ్,ములుగు సీపీవో జిల్లా సెన్సస్ అధికారి ఎం. ప్రకాష్,మున్సిపాలిటీ చార్జ్ ఆఫీసర్ కమిషనర్ సంపత్, స్టాటిస్టికల్ ఆఫీసర్ బి.లాల్ నాయక్,ఫీల్డ్ ట్రైనర్లు, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ దాడులు




నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో నకిలీ వైద్యులు మరియు అనధికార వైద్య సేవలపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రత్యేక దాడులు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక తనిఖీల్లో భాగంగా మే 12, 2026న నాగర్‌కర్నూల్ పట్టణం, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి గ్రామం, వనపర్తి జిల్లా బుద్ధరం గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు.

ఈ తనిఖీలను డాక్టర్ కిరణ్ కుమార్ తోటవార్, డాక్టర్ సన్నీ డేవిస్ అయ్యల నిర్వహించారు. తనిఖీల్లో అనధికారంగా నడుస్తున్న పలు క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు గుర్తించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సుశ్మిత హెల్త్ క్లినిక్, రహీమ్ క్లినిక్, శ్రీ సాయి క్లినిక్, రోహిణి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, శ్రీ దుర్గా క్లినిక్, లక్ష్మి క్లినిక్, అభిరామ్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, రాఘవేంద్ర ఫస్ట్ ఎయిడ్ సెంటర్ తదితర కేంద్రాలు అనుమతులు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.




అనధికార వైద్య సేవలు ప్రజారోగ్యానికి, రోగుల ప్రాణాలకు తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పేర్కొంది. తెలంగాణ మెడికల్ ప్రాక్టిషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టం (ఎఫీ=ూామ్), నేషనల్ మెడికల్ కమిషన్ (చీవీజ) చట్టంలోని సెక్షన్లు 34, 54 ప్రకారం నకిలీ వైద్యులు మరియు అనధికార వైద్య సేవలు నిర్వహిస్తున్న వారిపై కఠిన న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

తనిఖీ నివేదికలను సంబంధిత జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు (ఐవీనూ), పోలీస్ శాఖ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు తదుపరి చర్యల కోసం పంపనున్నట్లు వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలో నకిలీ వైద్యుల నిర్మూలన, నైతిక వైద్య విధానాల పరిరక్షణ, ప్రజారోగ్య రక్షణ కోసం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కట్టుబడి ఉందని స్పష్టం చేసింది.

# సైకాలజిస్టుల సేవలు అత్యంత కీలకం

## హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ




హైద్రాబాద్ మే 12:ప్రస్తుత సమాజంలో మానసిక ఆరోగ్యం అత్యంత కీలకమని, ఆ దిశగా నిరంతరం శ్రమిస్తున్న సైకాలజిస్టుల సేవలు అభినందనీయమని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. సైకాలజిస్టులకు వృత్తిపరమైన భరోసా, భద్రత కల్పించేందుకు 'సైకాలజిస్ట్స్ కౌన్సిల్' ఏర్పాటు ఎంతో అవసరమని, ఆ దిశగా తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. హైదరాబాద్లోని ఫిల్మ్ నగర్ కల్చరల్ క్లబ్ నందు తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (ఛూూ) ఆధ్వర్యంలో నిర్వహించిన "దశాబ్ది ఉత్సవాల అవార్డుల ప్రధానోత్సవం" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెచ్చరిల్లుతున్న విపరీత ధోరణులకు మానసిక ఆరోగ్యం లోపించడమే ప్రధాన కారణమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒత్తిడిని జయించడానికి ప్రతి ఒక్కరూ యోగా, ప్రాణాయామం వంటివి అలవరచుకోవాలని సూచించారుమాజీ జాతీయ మహిళా కమిషన్ త్రిపురాణ వెంకటరత్నంసలహాదారు సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కౌన్సిలింగ్ ఒక పదునైన ఆయుధంలా పనిచేస్తుందని, వేధింపులకు గురైన మహిళల్లో మనోధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత సైకాలజిస్టులపై ఉందని పేర్కొన్నారు.




గౌరవ అతిధు లు ప్రముఖ నిర్మాత ఙ దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ ఛూూ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం అభినందనీయమని అన్నారు. సమాజంలో జరుగుతున్న అకృత్యాలు, ఆత్మహత్యలను నివారించడంలో సైకాలజిస్టుల పాత్ర వెలకట్టలేనిదని తెలిపారు. టుంబాలలో తలెత్తే వివాదాలు విడాకులకు దారి తీస్తున్నాయని, డిప్రెషన్కు గురవుతున్న వారికి సరైన సమయంలో కౌన్సిలింగ్ అందించి వారిని కాపాడాలని కోరారు.

మానసిక వైకల్యం లేని సమాజాన్ని నిర్మించి, యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపాల్సిన గురుతర బాధ్యత సైకాలజిస్టులపై ఉందని అన్నారు. డా. మోతుకూరి రాంచందర్ (ఛూూ రాష్ట్ర అధ్యక్షులు): అసోసియేషన్ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సమాజంలో మానసిక సమస్యల పరిష్కారానికి మే 5 నుండి 15 వరకు వివిధ మానసిక ఆరోగ్య సదస్సులు మరిన్ని ఉచిత కౌన్సిలింగ్ సేవలు మరియు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తామని ప్రకటించారు. అవార్డుల ప్రధానం: ఈ వేడుకల్లో భాగంగా విశేష సేవలు అందించిన వారికి 14 మందికి: 'వుమెన్ ఐకాన్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైకాలజీ అవార్డ్', 08 మందికి: 'మైండ్ అండ్ మెరిట్ అవార్డ్'20 మందికి: 'డికేడ్ ఆఫ్ సర్వీస్ అవార్డ్' కింది అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సైకియాట్రిస్టు డా. హరిణి, వి.వి.ఎన్. వసుంధర, డా. పూర్ణిమ నాగరాజ మరియు సంఘ నాయకులు శ్రీపూజ, సుధాకర్, కృష్ణసాహితి, బి. నారాయణ రావు, సునయన, రాజు ఆచార్య, దేదీప్య, వశిష్ఠ, విశాల శ్రీకాంత్ మజ్జిగ తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి సాహు మహారాజ్ స్ఫూర్తి తో బీసీలు పాలన వైపు అడుగులు వేయాలి

## బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్

హైద్రాబాద్ మే 12:ఛత్రపతి సాహు మహారాజ్ మరాఠాల భోంస్లే రాజవంశానికి చెందిన ఒక యాదవ్ రాజు. ఆయనని ఛత్రపతి రాజర్షి సాహూ, రాజర్షి సాహూ మహారాజ్, కొల్హాపూర్ సాహూ అని కూడా పిలుస్తారు. ఆయన భారత రాచరిక రాష్ట్రమైన కొల్హాపూర్ మొదటి మహారాజుసాహు మహారాజ్ పట్టాభిషేకం 1894 ఏప్రిల్ 2న జరిగింది. ఆ రోజు ఆయన కొల్హాపూర్ సంస్థానానికి రాజుగా అధికారికంగా పట్టాభి షేకంపొందారు. 06-05-1922వరకు దాదాపు 28 సంవత్సరాలు కొల్హాపూర్ సంస్థానాన్ని సామాజిక న్యాయమే లక్ష్యంగా పరిపాలించారు.

.సామాజికఅసమానతలనుచూస్తూపెరిగినఛత్రపతి సాహు మహారాజ్ సమానత్వాన్ని నెలకొల్పాలని సంక ల్పించి .సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారు. వెనక బడిన వర్గాల అభ్యున్నతి కోసం స్త్రీ విద్య కోసం అంటరాని తనం, అమానుషం, పీడన, దోపిడీ, వివక్ష నిర్మూలన కోసం ఆయన పాలన లో తీసుకున్న సంస్కరణలు యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచాయి. 26-07- 1902 లో కొల్హాపూర్ సంస్థానం లో బ్రాహ్మణేతరులైన, బీసీ,ఎస్సి ఇతర వెనక బడిన వర్గాల ప్రజలకు విద్యా, ఉద్యోగాలలో 50శాతం రిజర్వేషన్లను కల్పిస్తు ఉత్తర్వులను జారీచేయడం త ో ఎ ా ట ం గ్రామపరిపాలనరంగంలోవంశపార్యాపరంగాకొన సాగుతున్న,పటేల్, పట్వారి, కులకర్ణి వ్యవస్థను రద్దు చేస్తూ సామజికన్యాయంఅమలు, కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న గొప్ప సంఘ సంస్కర్త ఛత్రపతి సాహు మహారాజ్ , పూలె ను ఆదర్శంగా తీసుకొని స్త్రీలు, బాలికల విద్య కోసం పాఠశాల లను ఏర్పాటు చేసి పూర్తి ఉచితవిద్యనందించడం తోపాటు బాలికలకు హాస్టళ్లను ఏర్పాటుచేశారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషి చేయడం తోపాటు కులాంతర


వివాహాలను చట్టబద్ధం చేశారు. తన పాలన లో వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల పై ఆధారపడి నష్ట పోకుండా సహకార సంఘాలను ఏర్పాటు చేసి రైతులకు, చేయూతనిచ్చారు. 1919మే నెల మూడు తారీకు న వెట్టి చాకిరీ వ్యవస్థ ను రద్దు చేస్తూ చట్టం చేసి బానిసత్వ నిర్ములనకు శ్రీకారం చుట్టారు. అస్పృశు ్యల హక్కుల సాధన కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్థాపించినమూక్ నాయక్. పత్రికను నడపడానికి సాహు మహారాజ్ రాజు ఆర్థిక సాయం అందించడం తోపాటు అంబేద్కర్ గారు ఇంగ్లాండ్ వెళ్లి ఉన్నత చదువులు చదవడానికి ఆర్థిక సాయం అందించి ఆదుకున్న త్యాగశీలి

చత్రపతి సాహు మహారాజు గారు 06-05-1922 నాడు భౌతికంగా ఆయన దూరమైనా ఆయన దేశ ప్రజల మనసుల్లో చిరంజీవి గానిలిచిపోయారు, స్వతంత్రానికి పూర్వమే అణగారిన కులాల ప్రజలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి చరిత్ర సృష్టించారు చత్రపతి సాహు మహారాజ్ .

హక్కులకు దూరమైన ప్రజల నుండి వచ్చిన నాయకులు మాత్రమే వారి హక్కుల కోసం పనిచేస్తాను, దేశానికి స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలు దాటినా

రాజ్యాంగ పలాలు బీసీలకు సంపూర్ణంగా అందకపోవడం

సామాజిక న్యాయస్ఫూర్తికి విరుద్ధం, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు,రాజకీయరంగంలో కూడా రిజర్వేషన్లు కావాలని గత 70 సంవత్సరాలుగా బీసీలు పోరాడుతున్నా



ప్రజాస్వామ్య దేశంలో మెజార్టీ ప్రజల అరిగోస ను పట్టించుకునే నాధుడే లేడు. చత్రపతి సాహు మహారాజు స్ఫూర్తితో బీసీలు మిలిటెంట్ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలి. ఓటరుగా మిగిలిపోకుండా,

ఓటు బ్యాంకు రాజకీయాలను చదరగొట్టి, మెజార్టీ ఓటరులు పాలనవైపు అడుగులు వేసినప్పుడే చత్రపతి సాహు మహారాజు ఆశించిన, నిజమైన సమ సమాజ నిర్మాణం పూర్తవుతుంది.

వ్యాస కర్త

బూర్గుపల్లి కృష్ణ యాదవ్ MA

బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు

సెల్,, 9866170384

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com